Follow: @ANNTELUGU

15-05-2025

ANN తెలుగు

# మహా పత్రిక

గురువారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 162 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## బాధ్యతలు స్వీకరణ

### ప్రమాణ స్వీకారం చేసిన ఆర్టీఐ కొత్త కమిషనర్లు

మూడేళ్లు లేదా 65 ఏళ్ల వయసు వరకు పదవీకాలం


హాజరైన సీఎం రేవంత్, సీఎస్ రామకృష్ణారావు

**హైదరాబాద్, మహా:** రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్లుగా సీనియర్ జర్నలిస్టులు పీవీ శ్రీనివాస్, అయోధ్య రెడ్డి, న్యాయవాదులు దేశాల భూపాల్, మోహిసినా పర్వీన్ ప్రమాణ స్వీకారం చేశారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో వారితో రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ జి.చంద్ర శేఖర్ రెడ్డి ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో పాటు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన ఆర్టీఐ కమిషనర్లకు సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. వీరు పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి మూడేళ్ల పాటు లేదా వయసు 65 ఏళ్లు నిండే వరకు వారు రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్లుగా పదవిలో కొనసాగనున్నారు.

టాప్ న్యూస్

## త్వరలో కేసీఆర్ సీఎం

- ఇది బీజేపీ భవిష్యవాణి
- కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజీ డీల్
- గులాబీ పార్టీని విలీనం చేయడం ఖాయం
- జూన్ 2 లేదా డిసెంబర్ 9 తర్వాత విలీనం చేస్తారు
- బీజేపీ నేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ సంచలన వ్యాఖ్యలు



07

## బీజేపీ, బీఆర్ఎస్ డీఎన్ఏ ఒక్కటే


- బీజేపీ లీడర్లకు మెదడు మోకాళ్లలో ఉంది
- కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనం కాకపోతే బీజేపీని నిషేధిస్తారా?
- ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్‌కు అద్దంకి దయాకర్ స్ట్రాంగ్ కౌంటర్



02

## ప్లీజ్ నీళ్లివ్వండి

- తాగు నీరుకు అల్లాడిపోతున్నాం
- మా దేశ ప్రజల నోళ్లు ఎండిపోతున్నాయి
- సింధూ జలాల రద్దుపై నిర్ణయం వెనక్కి తీసుకోండి
- కాళ్ల బేరానికి వచ్చిన దాయాది పాకిస్థాన్
- భారత జలశక్తి మంత్రిత్వ శాఖకు పాక్ జలవనరుల శాఖ లేఖ



03

# పాక్‌కు బిగ్ షాక్

## స్వతంత్ర దేశంగా బలూచిస్తాన్!

నూతన ప్రభుత్వ ఏర్పాటుకు కసరత్తు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటన

క్వెట్టాలో కొత్త పార్లమెంట్ ఫొటోలు విడుదల

**మహా:** పాకిస్తాన్ కు బలూచిస్తాన్ షాక్ ఇచ్చింది. తమను తాము స్వతంత్ర దేశంగా ప్రకటించుకుంది. ప్రభుత్వ ఏర్పాటుకు కూడా సిద్ధం అవుతున్నామని... పార్లమెంటు, జాతీయ చిహ్నం ఫోటోలను షేర్ చేసింది. భారత్, పాకిస్తాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా జోక్యంతో కాల్పుల విరమణ ఒప్పందం జరిగింది. భారత్ దాడులతో కుదేలైన పాకిస్తాన్‌కు మరో షాక్ తగలింది. గత కొంతకాలంగా తమను ప్రత్యేక దేశంగా ఏర్పాటు చేయాలని పాక్ పై తిరుగుబాటు చేస్తున్న బలూచ్ తెగల వారు.. ఎవరూ ఊహించని విధంగా స్వతంత్ర దేశంగా ప్రకటించుకున్నారు.

మిగతా 2లో






ఇది ప్రజాస్వామ్యమా..

## రేవంత్ రాచరిక రాజ్యమా?

- ఉద్యోగాల్లో చేరుతున్న వారికి వార్నింగా?
- ఏడాదిన్నరలోనే ఇరిగేషన్ పూర్తి నిర్లక్ష్యం
- కుప్పకూలిన ఎస్ఎల్బీసీపై ఎందుకు మాట్లాడవు
- దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్చకు సిద్ధమా?
- ముఖ్యమంత్రికి మాజీ మంత్రి హరీశ్ రావు ఛాలెంజ్

వివరాలు 2లో




# చైనాకు వార్నింగ్

## అరుణాచల్‌లో కొన్ని ప్రాంతాలకు చైనా కొత్త పేర్లు

చైనా చర్యను తీవ్రంగా ఖండించిన భారత విదేశాంగ శాఖ

అరుణాచల్ ప్రదేశ్ భారత్‌లో అంతర్భాగమని పునరుద్ఘాటన

**మహా:** అరుణాచల్ ప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలకు చైనా ఏకపక్షంగా కొత్త పేర్లు పెట్టడాన్ని భారత్ తీవ్రంగా ఖండించింది. ఇటువంటి 'సృజనాత్మక' చర్యల ద్వారా క్షేత్రస్థాయి వాస్తవాలను మార్చలేరని, అరుణాచల్ ప్రదేశ్ ఎప్పటికీ భారతదేశంలో అంతర్భాగమేనని విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. చైనా ప్రభుత్వం అరుణాచల్ ప్రదేశ్‌లోని కొన్ని ప్రదేశాల పేర్లను మార్చినట్లుగా వచ్చిన వార్తలపై భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి స్పందించారు. చైనా చేపట్టిన ఈ చర్యను పూర్తిగా తిరస్కరిస్తున్నట్లు ప్రకటించారు. "కొత్త పేర్లను సృష్టించినంత మాత్రాన క్షేత్రస్థాయి వాస్తవాలు మారిపోవని మా ప్రభుత్వం గట్టిగా విశ్వసిస్తోంది" అని ఆయన వ్యాఖ్యానించారు. అరుణాచల్ ప్రదేశ్ భారతదేశానికి చెందిన విడదీయరాని భాగమని, ఈ వాస్తవాన్ని ఎవరూ మార్చలేరని ఆయన పునరుద్ఘాటించారు. చైనా ఇలాంటి ప్రయత్నాలు చేయడం ఇదే మొదటిసారి కాదని, గతంలో కూడా ఇలాంటి నిరాధారమైన వాదనలు చేసిందని, వాటిని కూడా భారత్ తిరస్కరించిందని ఆయన గుర్తు చేశారు. చైనా చర్యలు పూర్తిగా నిరాధారమైనవని, వాటికి ఎలాంటి చట్టబద్ధత లేదని భారత ప్రభుత్వం తన అధికారిక ప్రకటనలో పేర్కొంది. భారతదేశ సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రత విషయంలో తమ వైఖరి చాలా దృఢంగా ఉందని, దానిని కాపాడుకోవడానికి కట్టుబడి ఉన్నామని విదేశాంగ శాఖ ఈ సందర్భంగా మరోసారి స్పష్టం చేసింది. ఈ అంశంపై తదుపరి పరిణామాలను నిశితంగా గమనిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

కట్టిన మూడేళ్ళలో కుప్పకూలిన ప్రాజెక్టు

# కాళేశ్వరం మాత్రమే

## అప్పటి సీఎం హెలికాప్టర్‌లో వెళ్తూ ప్రాజెక్టు ఎక్కడ కట్టాలో చెప్పేవారు

విజిలెన్స్ నివేదికల్లో అధికారులను ఉరితీయాలని చెప్పారు

నాయకులు చెప్పారని చేస్తే.. అధికారులు ఊచలు లెక్కబెడతారు

కొలువుల పండుగలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్, మహా**

కట్టిన మూడేళ్లలో కుప్పకూలిన ప్రాజెక్టు భూ ప్రపంచంలో కాళేశ్వరం మాత్రమేనని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. నీళ్ల అవసరమే తెలంగాణను సాధించిందన్న రేవంత్.. గతంలో తెలంగాణ ఉద్యమాన్ని భావోద్వేగంగా మార్చి రాజకీయ ప్రయోజనం పొందారన్నారు. అనేక విషయాలపై ముక్కుసూటిగా మాట్లాడిన రేవంత్ రెడ్డి అనేక విషయాలపై సమగ్రంగా వివరించారు. విపక్ష బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పై తీవ్ర స్థాయిలో విమర్శలు సెటైర్లు వేస్తూ ముప్పేటదాడి చేశారు. అటు ఉద్యోగుల గురించి కూడా సీఎం రేవంత్ కుండబద్ధలు కొట్టారు. "ఎవరు చేయాల్సిన పని వారు చేయాలి. నాయకులు చెప్పారని చేస్తే అధికారులు ఊచలు లెక్కపెట్టాల్సి వస్తుంది. అప్పటి సీఎం హెలికాప్టర్లో వెళుతూ ఎక్కడ ప్రాజెక్టు కట్టాలో చెప్పారట. విజిలెన్స్ ఎన్ డిఎస్ ఏ నివేదికల్లో అధికారులను ఉరితీయాలని చెప్పారు." "ప్రాజెక్టు ఎలా కట్ట కూడదో కాళేశ్వరంను చూసి తెల్సుకోవాలి. ఎలా నిర్మించాలో నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులను చూసి నేర్చుకోవాలి.

మిగతా 2లో



## సీజేఐగా జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రమాణం

- ప్రమాణ స్వీకారం చేయించిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
- ప్రధాని మోదీ, ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా హాజరు
- సుప్రీం కోర్టు రెండో దళిత న్యాయమూర్తిగా గవాయ్ రికార్డ్
- కీలకమైన రాజకీయ కేసుల్లో తన తీర్పులకు ప్రసిద్ధి

వివరాలు 2లో



## బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో..

- ఓరుగల్లు అందాలకు ప్రపంచ ముద్దుగుమ్మలు ఫిదా
- బతుకమ్మ, డోలు- సన్నాయి ఆటపాటలతో ఘనస్వాగతం
- తెలుగుదనం ఉట్టిపడేలా పట్టు పరికిణి లో సందడి
- వెయి స్తంభాల గుడి, రామప్ప ఆలయాల సందర్శన
- శిల్పాల హోయలకు ముగ్ధులైన మిస్ వరల్డ్ బ్యూటీస్
- నేడు యాదగిరిగుట్టకు ప్రపంచ సుందరాంగులు

వివరాలు 3లో

## జూన్ 2 నుంచి భూభారతి సదస్సులు

### ఇక పేరుకుపోయిన భూ సమస్యలకు చెక్

రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండలాల్లో నిర్వహణ

వ్యవస్థను ప్రజలకు దగ్గర చేసి మెరుగైన సేవలు అందిస్తాం

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో మర్యాదపూర్వకంగా భేటీ

భూభారతి చట్టం, ఇందిరమ్మ ఇండ్ల స్కీమ్స్‌పై వివరణ

**మహా:** జూన్ 2 నుంచి రాష్ట్రవ్యాప్తంగా భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవమైన జూన్ 2వ తేదీ నుంచి భూభారతి


మిగతా 2లో



## భారత్, పాక్‌ను ఒప్పించింది నేనే

- 5 రోజుల్లో 7 సార్లు ట్రంప్ సేమ్ కామెంట్స్
- ట్రంప్ పాత పాటపై భారతీయుల గుర్రు

వివరాలు 4లో



## పన్నెండేళ్లకోసారి..

### నేటి నుంచి సరస్వతి పుష్కరాలు

సరస్వతి ఘాట్ ప్రారంభించనున్న సీఎం రేవంత్

త్రివేణీ సంగమంలో స్నానం ఆచరించున్న సీఎం, మంత్రులు

భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేసిన రాష్ట్ర ప్రభుత్వం

స్పెషల్ బస్సులు నడిపించేందుకు ఆర్టీసీ సన్నద్ధం

03

శ్రవణ్ రావును విచారిస్తున్న

## సీసీఎస్ పోలీసులు

- టన్నుకు రూ. 300 లాభం వస్తుందని చెప్పి రూ.6.5 కోట్లు వసూలు
- శ్రవణ్ రావుతో కలిసి భార్య స్వాతి రావు మోసం

వివరాలు 3లో






## పాక్‌కు బిగ్ షాక్
### స్వతంత్ర దేశంగా బలూచిస్తాన్!

నూతన ప్రభుత్వ ఏర్పాటుకు కసరత్తు

ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటన

క్వెట్టాలో కొత్త పార్లమెంట్ ఫొటోలు విడుదల

(మొదటిపేజీ తరువాయి)

వివరాల్లోకి వెళితే.. బలూచిస్తాన్ , పాకిస్తాన్‌లోని పశ్చిమ ప్రాంతంలో ఉన్న ఒక ప్రావిన్స్, దీర్ఘకాలంగా స్వాతంత్ర ఉద్యమాలకు కేంద్రంగా ఉంది. బలూచ్ ప్రజలు తమ సహజ వనరుల దోపిడీ, రాజకీయ హక్కుల కొరత, పాకిస్తాన్ సైన్యం చేస్తున్న అణచివేతలపై ఆరోపణలు చేస్తూ స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్నారు. బలూచ్ లిబరేషన్ ఆర్మీ ఈ ఉద్యమంలో ప్రముఖ సాయుధ సంస్థగా ఉంది. ఇది పాకిస్తాన్ సైన్యం , మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తూ స్వతంత్ర బలూచిస్తాన్ కోసం పోరాడుతోంది. ఈ క్రమంలోనే నేడు స్వతంత్ర దేశం గా అవతరించినట్లు స్వయంగా ప్రకటించుకుంది. అలాగే నూతన ప్రభుత్వ ఏర్పాటుకు తాము కసరత్తు చేస్తున్నామని క్వెట్టాలో కొత్త పార్లమెంట్ కు ఫోటోలు, జాతీయ చిహ్నం, జాతీయ గీతానికి సంబంధించిన వీడియోను బలూచిస్తాన్ విడుదల చేసింది. అలాగే భారత్ సహా ఇతర దేశాలు తమ కొత్త బలూచిస్తాన్ దేశానికి వచ్చి ఎంబసీలు ఏర్పాటు చేయాలని కోరింది.

# పన్నెండేళ్లకోసారి..
## నేటి నుంచి సరస్వతి పుష్కరాలు

సరస్వతి ఘాట్ ప్రారంభించనున్న సీఎం రేవంత్

త్రివేణీ సంగమంలో స్నానం ఆచరించున్న సీఎం, మంత్రులు

భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేసిన రాష్ట్ర ప్రభుత్వం

స్పెషల్ బస్సులు నడిపించేందుకు ఆర్టీసీ సన్నద్ధం



**మహా:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో నేటి నుంచి ప్రారంభం కానున్న సరస్వతి పుష్కరాల సందర్భంగా త్రివేణి సంగమం వద్ద సరస్వతి ఘాట్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారు. ఈ పుష్కర ఘాట్ ప్రారంభం అనంతరం, కాళేశ్వర త్రివేణీ సంగమంలో ముఖ్యమంత్రి పుణ్యస్నానం ఆచరిస్తారు. పుష్కరాల ఆరంభ కార్యక్రమంలో పాల్గొనేందుకు కాళేశ్వరం పర్యటనకు సీఎం వస్తున్న సందర్భంగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే, ముఖ్యమంత్రి భద్రతా అధికారి వాసుదేవరెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించి బుధవారం కాళేశ్వరంలో ఈఓ కార్యాలయంలో ముఖ్యమంత్రి పర్యటనపై వారు అధికారులతో భద్రతా ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా భక్తులు ఎవ్వరు అసౌకర్యానికి గురికాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. హెలికాప్టర్ ద్వారా గురువారం సాయంత్రం 5 గంటలకు ముఖ్యమంత్రి కాళేశ్వరం చేరుకుంటారని కలెక్టర్ తెలిపారు. సీఎం రవాణా చేయు మార్గంలో పోలీస్ బందోబస్తు, బాంబ్ స్క్వాడ్, ట్రాఫిక్ కంట్రోల్, ఆయా విభాగాల సమన్వయంతో భద్రతా చర్యలు పర్యవేక్షణ చేయాలని, మార్గంలో బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

**12 సంవత్సరాలకు ఒకసారి..**

ముఖ్యమంత్రితో పాటు పలువురు మంత్రులు కూడా ఈ పుష్కరాలలో పాల్గొంటారు. 12 సంవత్సరాలకు ఒకసారి వచ్చే ఈ అరుదైన సరస్వతి మహా పుష్కరాలకు తెలంగాణ ప్రభుత్వ దేవాదాయ శాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది. నేడు ఉదయం 5 .44 గంటలకు తొగుట ఆశ్రమం పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామీజీ సంకల్పంతో పాటు పుష్కర స్నానం ఆరంభిస్తారు.

**ప్రత్యేక బస్సులు..**

సరస్వతీ పుష్కరాలకు రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే భక్తుల కోసం ఈ నెల 15వ తేదీ నుంచి 26వ తేదీ వరకు స్పెషల్ బస్సులు నడిపించేందుకు ఆర్టీసీ సిద్ధమైంది. ఇందులో హైదరాబాద్, మంచిర్యాల, కరీంనగర్ తో పాటు వరంగల్ రీజియన్ పరిధిలోని వరంగల్, హనుమకొండ, జనగామ, పరకాల, భూపాలపల్లి, తొర్రూరు, నర్సంపేట, మహబూబాబాద్ డిపోల నుంచి బస్సులు నడిపించేందుకు ఆఫీసర్లు కసరత్తు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సరస్వతీ పుష్కరాలకు వెయ్యి బస్సులు నడిపించేందుకు ప్రణాళిక రెడీ చేయగా.. అందులో వరంగల్ రీజియన్ నుంచే 790 బస్సులతో 1,580 ట్రిప్పులు తిప్పేందుకు చర్యలు చేపట్టారు. హైదరాబాద్ నుంచి దాదాపు వందకు పైగా బస్సులు నడిపించనున్నారు. కరీంనగర్ జిల్లా నుంచి 50, మంచిర్యాల జిల్లా నుంచి మరో 50కిపైగా బస్సులు తిప్పనున్నారు. సరస్వతీ నదీ పుష్కరాల నేపథ్యంలో ప్రయాణికుల రద్దీకి తగ్గట్టుగా బస్సులు నడిపిస్తామని ఆర్టీసీ వరంగల్ ఆర్ఎం డి.విజయభాను తెలిపారు.

### కట్టిన మూడేళ్ళలో కుప్పకూలిన ప్రాజెక్టు
# కాళేశ్వరం మాత్రమే
## అప్పటి సీఎం హెలికాప్టర్‌లో వెళ్తూ ప్రాజెక్టు ఎక్కడ కట్టాలో చెప్పేవారు

విజిలెన్స్ నివేదికల్లో అధికారులను ఉరితీయాలని చెప్పారు

నాయకులు చెప్పారని చేస్తే.. అధికారులు ఊచలు లెక్కబెడతారు

కొలువుల పండుగలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు



(మొదటిపేజీ తరువాయి)

కొందరు కోర్టులో కేసులు వేసి ఉద్యోగ నియామకాలు అడ్డుకుంటున్నారు. గ్రూప్ వన్ పరీక్షలకు ఏర్పాట్లు అన్ని పూర్తి అయ్యాయి. కానీ కొందరు కోర్టుకు వెళ్లి అడ్డుకున్నారు. నీళ్లు మన నాగరికత.. నీళ్ల కోసమే తెలంగాణ ఉద్యమం పుట్టింది. నీళ్ల కోసం మొదలైన మన ఆకాంక్షనే రాష్ట్రాన్ని సాధించి పెట్టింది. ఇది ఉద్యోగం కాదు.. ఒక భావోద్వేగం.. ఆ భావోద్వేగానికి మీరే ప్రతినిధులు. భావోద్వేగంతో కొన్ని పార్టీలు రాజకీయ లబ్ది పొందాయి." అని సీఎం రేవంత్ అన్నారు.

**80 వేల పుస్తకాలు చదివిన వ్యక్తి ఇంజనీరుగా మారి..**

"రెండు లక్షల కోట్లు ఖర్చుపెట్టినా తెలంగాణలో ఉమ్మడి రాష్ట్రంలో మొదలు పెట్టిన ప్రాజెక్టులు పూర్తి కాలేదు. గతంలో కట్టిన సాగునీటి ప్రాజెక్టులు ఎన్ని ఉపద్రవాలు వచ్చినా ఇప్పటికీ చెక్కు చెదరలేదు. కానీ కాళేశ్వరం మూడేళ్ళలోనే కట్టడం, కూలడం రెండూ జరిగిపోయాయి. ఎలా కట్టకూడదో, ఎలా కడితే ప్రజలకు నష్టం జరుగుతుందో అనే దానికి ఉదాహరణ కాళేశ్వరం. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులు కట్టిన చోట కనీసం సాయిల్ టెస్ట్ చేయలేదు. 80 వేల పుస్తకాలు చదివిన వ్యక్తి ఇంజనీరుగా మారి కట్టిన కాళేశ్వరం పరిస్థితి ఇది. త్వరలోనే గ్రూప్స్ ఉద్యోగాల నియామకాలు పూర్తి చేస్తాం" అని సీఎం రేవంత్ అన్నారు. జలసౌధలో కొలువుల పండుగ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు. హాజరయ్యారు. నీటిపారుదల శాఖలో కొత్తగా నియమితులైన ఏఈ, జేటీవో లకు సీఎంఈ సందర్భంగా నియామక పత్రాలు అందజేశారు. తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కాబోతున్న మీ అందరికీ అభినందనలు. అని సీఎం కొత్త ఉద్యోగులను సాదరంగా ఆహ్వానించారు.

## బీజేపీ, బీఆర్ఎస్ డీఎన్ఏ ఒక్కటే

- బీజేపీ లీడర్లకు మెదడు మోకాళ్లలో ఉంది
- కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనం కాకపోతే బీజేపీని నిషేధిస్తారా?
- ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్‌కు అద్దంకి దయాకర్ స్ట్రాంగ్ కౌంటర్



**మహా:** బీజేపీ లీడర్లకు మెదడు మోకాళ్ళలో ఉందని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య డీల్ కుదిరిందని, విలీనం ఖాయమంటూ బీజేపీ నేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. దీనిపై ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీ వాళ్ళ బుద్ధిలో మార్పు రావడం లేదన్నారు. అబద్ధాలు ప్రచారం చేయడంలో బీజేపీ వాళ్ళు దిట్ట అంటూ మండిపడ్డారు. నియంతలకు అబద్ధాల మీద బాగా ప్రేమ ఉంటుందన్నారు. బీజేపీ వాళ్లు చాలా జోక్‌గా మాట్లాడుతున్నారని, బీఆర్ఎస్ పార్టీలో కాంగ్రెస్ ఎందుకు విలీనం అవుతుందని ప్రశ్నించారు. 'ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఎవరి వర్గం. ఈటల రాజేందర్, బండి సంజయ్, కిషన్ రెడ్డి ఎవరి వర్గం నువ్వు. ఈటలను కేసీఆర్ పక్కకు పెట్టినప్పుడు కూడా ఇన్ని మాటలు మాట్లాడలేదు. జూన్ 2 లేదా డిసెంబర్‌లో బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ పార్టీలో విలీనం కాకపోతే బీజేపీ పార్టీని రాష్ట్రంలో నిషేధిస్తారా.. మాతో పోరాటం మీకు చేత కావడం లేదా' అంటూ ధ్వజమెత్తారు. బీజేపీ, బీఆర్ఎస్ డీఎన్ఏ ఒక్కటే అని ఆరోపించారు. ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ గతంలో ఇలాగే కారు కూతలు కూశారని.. అప్పుడు ఏమైందో ఆయనకు తెలుసన్నారు. ఈ టర్మ్ కాదు వచ్చే టర్మ్ కూడా రేవంత్ రెడ్డి మళ్ళీ సీఎం అవుతారని బీజేపీ వాళ్లకు క్లారిటీ ఉందన్నారు.

## ఇది ప్రజాస్వామ్యమా.. రేవంత్ రాచరిక రాజ్యమా?
### ఉద్యోగాల్లో చేరుతున్న వారికి వార్నింగ్గా?

- ఏడాదిన్నరలోనే ఇరిగేషన్ పూర్తి నిర్లక్ష్యం
- కుప్పకూలిన ఎస్ఎల్బీసీపై ఎందుకు మాట్లాడవు
- దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్చకు సిద్ధమా?
- ముఖ్యమంత్రికి మాజీ మంత్రి హరీశ్ రావు ఛాలెంజ్



**మహా:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్‌కు నియామక పత్రాలు అందించి, తమ ఘనతగా చెప్పుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి తంటాలు పడ్డారని అన్నారు. నియామక పత్రాలు అందిస్తూ నాలుగు మంచి మాటలు చెప్పాల్సింది పోయి, యదావిధిగా తనదైన శైలిలో అవే అబద్ధాలు వల్లె వేసిండన్నారు. ఉద్యోగాల్లో చేరుతున్న వారిలో ఉత్సాహాన్ని నింపాల్సింది పోయి వార్నింగ్ ఇచ్చి భయభ్రాంతులకు గురి చేశారని వ్యాఖ్యానించారు. అధికారులను ఉరి తీయాలని విజిలెన్స్, ఎన్డీఎస్ఏ నివేదికలు చెబుతాయా? ఇది ప్రజాస్వామ్యమా లేక రేవంత్ రాచరిక రాజ్యమా? అంటూ ప్రశ్నించారు. ఇంతకంటే అజ్ఞానం ఉన్న వ్యక్తి సోమాలియా నుంచి అమెరికా వరకు ఎక్కడ వెతికినా కనిపించడు కావొచ్చు అంటూ సెటైర్లు వేశారు. రాజకీయ నాయకుల సూచనలు పాటిస్తే ఊచలు లెక్కపెడుతారని ఇంజినీర్లను హెచ్చరిస్తున్న రేవంత్ రెడ్డి, ఏ జ్ఞానంతో కాళేశ్వరం కూలిందని దుష్ప్రచారం చేస్తున్నావంటూ ఫైర్ అయ్యారు. నువ్వేమన్నా ఇంజినీర్‌వా?, ఇరిగేషన్ నిపుణుడివా? అంటూ నిలదీశారు. కాళేశ్వరంపై తాము చేసిన ఖర్చు ఓసారి లక్ష 50 వేల కోట్లు అంటవు, ఓసారి లక్ష కోట్లు అంటవు, ఓ సారి ఒక్క గుంటకు నీళ్లు ఇవ్వలేదంటవు, మరోసారి 50 వేల ఎకరాలకే నీళ్లు ఇచ్చినవు అంటడు. నీది నోరా లేక తాటి మట్టనా రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బాధ్యత గల పదవిలో ఉండి రోజురోజుకు స్థాయి దిగజార్చుతున్నావని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. రాజకీయాలు మాట్లాడటమే తప్ప కుప్పకూలిన ఎస్ఎల్బీసీ భవితవ్యం గురించి ఒక్క మాట కూడా ఎందుకు మాట్లాడటం లేదన్నారు. తప్పుడు ప్రచారం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దీనిపై చర్చకు సిద్ధమా? అంటూ సవాల్ విసిరారు. ఏడాదిన్నర పాలనలో ఇరిగేషన్ శాఖలో చేసింది చెప్పుకునేది లేక అడ్డగోలుగా మాట్లాడి విలువ మరింత తగ్గించుకున్నాడన్నారు. రేవంత్ పాలనలో పెరిగింది ఇరిగేషన్ కాదు, ఇరిటేషన్ అంటూ వ్యాఖ్యానించారు. ఏడాదిన్నర పాటు ఇరిగేషన్ రంగాన్ని పూర్తి నిర్లక్ష్యం చేసి, ఇప్పుడు ప్రాధాన్య రంగమని మాటలు చెబుతుండటం హాస్యాస్పదమన్నారు.



## అన్నంత పని చేసిన కేఏ పాల్
### ..టర్కీ నుండి వీడియో రిలీజ్

**మహా :** ప్రజాశాంతి పార్టీ అధినేత కేఏ పాల్ అన్నంత పనిచేశారు. నిన్న తనను టర్కీ వెళ్లకుండా ఇండిగో సిబ్బంది అడ్డుకున్నారని రచ్చ చేసిన సంగతి తెలిసిందే. కాగా ఆయన టర్కీ వెళ్లి అక్కడ మహదీ అనే వ్యక్తితో కలిసి ఓ వీడియోను రిలీజ్ చేశారు. మహదీ చైర్మెన్ అని తన పోస్టులో పేర్కొన్నారు. వీడియోలో పాల్ మాట్లాడుతూ... పాకిస్థాన్‌కు టర్కీ మిస్సైల్స్ అమ్మింది నిజమేనని అన్నారు. కానీ అమెరికా పాకిస్థాన్ కు మిస్సైల్స్ అమ్మలేదా అని ప్రశ్నించారు. సౌదీ అరేబియాకు ట్రంప్ మిస్సైల్స్ అమ్మడానికే వెళ్లాడని చెప్పారు. ఈ యుద్ధాల్లో ఎంతోమంది మనదేశ పౌరులు ప్రాణాలు కోల్పాయరన్నారు. ఇదే న్యూక్లియర్ వార్ అయితే లక్షలు కోట్ల మంది చనిపోతారన్నారు. అందుకే రష్యా ఉక్రెయిన్ యుద్ధం సమయంలో అక్కడ తాను ఉంటానని చెప్పారు. మిస్సైల్స్ ఆపడానికే తాను టర్కీ వెళ్లినట్టు తెలిపారు. యుద్ధాలు ఆపాలని అన్నారు. యుద్ధం కోసం సామాగ్రిని అమ్మకూడదని అన్నారు. యుద్ధాలను మొదలుపెట్టేవారు కాదని ఆపే నాయకత్వం కావాలని చెప్పారు.

## భారత్, పాక్‌ను ఒప్పించింది నేనే
### 5 రోజుల్లో 7 సార్లు ట్రంప్ సేమ్ కామెంట్స్.. ట్రంప్ పాత పాటపై భారతీయుల గుర్రు



**మహా:** భారత్ , పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందంలో అమెరికా కీలక పాత్ర పోషించిందని మరోసారి ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. ఒప్పందం విషయంలో అమెరికా మధ్యవర్తిత్వం వహించిందని ట్రంప్ పేర్కొనడం శనివారం నుంచి ఐదోసారి కావడం గమనార్హం. సౌదీ పర్యటనలో అదే వ్యాఖ్యలు చేసిన ట్రంప్, ఆ తర్వాత మళ్లీ పాత పాటే పాడారు. రెండు దేశాల మధ్య శాంతి నెలకొనడానికి, వాణిజ్య ఒప్పందాలు చేసుకోవడానికి భారత్ , పాకిస్థాన్‌ను ఒప్పించామని ట్రంప్ తెలిపారు. అది తన అద్భుతమైన వారంలోనే జరిగిందని చెప్పారు. ఇది యుద్ధాల కాలం కాదని తాను భావిస్తున్నట్లు వ్యాఖ్యానించారు. రెండు దేశాల్లో మంచి నాయకులు ఉన్నారని కొనియాడారు. భారత్ , పాక్ బలమైన అణ్వాయుధ దేశాలని, వాటి వద్ద శక్తిమంతమైన ఆయుధాలు ఉన్నాయని అన్నారు.

**'అణ్వాయుధాల కంటే వాణిజ్య ఒప్పందాలు గొప్ప'**

యుద్ధం జరిగితే లక్షలాది మంది చనిపోవచ్చని తెలిపారు ట్రంప్. అందుకే తాను, వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్, విదేశాంగ కార్యదర్శి మార్క్ రుబియో కలిసి ఓ మంచి పని చేశామని తెలిపారు. ఒక టీమ్‌గా ఉన్నామని, వాణిజ్య ఒప్పందాలు చేసుకుందామని తామే ప్రతిపాదించినట్లు తెలిపారు. అణ్వాయుధాల కంటే వాణిజ్య ఒప్పందాలు గొప్ప విషయంగా వర్ణించారు. అక్కడికి కొన్ని గంటల ముందు, సౌదీ అరేబియాలోని రియాద్‌లో తనకు యుద్ధం ఇష్టం లేదని, శాంతిని సృష్టించే వ్యక్తిగా, ఐక్యంగా ఉండాలని కోరుకుంటున్నానని ట్రంప్ తెలిపారు. భారత్ పాక్ మధ్య ఒప్పందం కుదిరేందుకు వాణిజ్యాన్ని ఉపకరణంగా వినియోగించానని చెప్పారు. అణు క్షిపణుల వాణిజ్యం చేయొద్దని, అందరికీ ఆనందాలు కలగచేసే విషయాల్లో చేద్దామని చెప్పినట్లు వెల్లడించారు. ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రవాద దాడిలో 26 మంది మరణించిన నేపథ్యంలో మే 7న భారత్ 'ఆపరేషన్ సిందూర్'తో ప్రతీకార చర్యలు చేపట్టింది. పాకిస్థాన్, పీవోకేలో ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసిన వాటిని మట్టుబెట్టింది. ఆ తర్వాత పాకిస్థాన్ మే 8, 9, 10 తేదీల్లో అమాయక ప్రజలపై దాడి చేయడానికి ప్రయత్నించింది. వాటిని భారత్ తిప్పికొట్టింది. అనంతరం మే 10న రెండు దేశాలు కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకున్నాయి. వాటిలో అమెరికాదే కీలక పాత్ర ట్రంప్ కొన్నిరోజుల నుంచి చెప్పుకుంటూ వస్తున్నారు.



## శ్రవణ్ రావును విచారిస్తున్న సీసీఎస్ పోలీసులు

- టన్నుకు రూ. 300 లాభం వస్తుందని చెప్పి రూ. 6.5 కోట్లు వసూలు
- శ్రవణ్ రావుతో కలిసి భార్య స్వాతి రావు మోసం

**హైదరాబాద్ :** ఫోన్ ట్యాపింగ్ కేసు లో నిందితుడు శ్రవణ్ రావు ను విచారిస్తున్న సీసీఎస్ పోలీసుల విచారణ కొనసాగుతోంది. అఖండ ఇండియా టెక్ ప్రయివేటు లిమిటెడ్‌ను మోసం చేసిన కేసు లో శ్రవణ్ రావును అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఏ4గా శ్రవణ్ రావు భార్య స్వాతి రావును చేర్చారు. స్వాతిరావును కూడా సీసీఎస్ పోలీసులు విచారణ చేయనున్నారు. ఇన్ రథమ్ ఎనర్జీ ప్రయివేటు లిమిట్ డైరెక్టర్ అని చెప్పి శ్రవణ్ రావు మోసం చేశారు. ముడి ఇనుము సరఫరా చేసేందుకు అఖండ ఇండియా టెక్ ప్రయివేటు లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. టన్నుకు రూ. 300 లాభం వస్తుందని చెప్పి రూ. 6.5 కోట్లు వసూలు చేసి.. మోసం చేసినట్లు సీసీఎస్ పోలీసులు గుర్తించారు. ఈ కేసులో భర్త శ్రవణ్ రావుతో కలిసి భార్య స్వాతి రావు మోసం చేసినట్లు నిర్ధారించారు.

## జూన్ 2 నుంచి భూభారతి సదస్సులు

(మొదటిపేజీ తరువాయి)



చట్టంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహణ ఉంటుందని ఆయన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత పదేళ్లలో రాష్ట్రంలో పేరుకుపోయిన భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న ఆశయంతో గత నెల 14వ తేదీన భూభారతి చట్టాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతులమీదుగా ప్రారంభించుకోవడం జరిగిందని గుర్తు చేశారు. ప్రయోగాత్మకంగా అదేనెల 17వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నాలుగు జిల్లాల్లోని నాలుగు మండలాల్లో ఈ నెల 5వ తేదీ నుంచి 30వ తేదీ వరకు 28 జిల్లాల్లోని 28 మండలాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఆయా మండలాల్లో ఎదురైన అనుభవాలను దృష్టిలో పెట్టుకొని వచ్చే నెల 2వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని నిర్ణయించినట్లు స్పష్టం చేశారు. ఈ రెవెన్యూ సదస్సులలో వచ్చే దరఖాస్తులకు నిర్దేశిత గడువు పెట్టుకొని భూ భారతి చట్టం పరిధిలోకి వచ్చే ప్రతి దరఖాస్తుకు పరిష్కారం చూపిస్తామని ప్రకటించారు. ప్రయోగాత్మకంగా నిర్వహించిన మండలాల్లో ఇప్పటికే కొన్నింటిని పరిష్కరించడం జరిగిందని, ఈనెల చివరినాటికి వీలైనంతవరకూ సమస్యలను పరిష్కరించాలని ఇప్పటికే కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు.

**లిఖిత పూర్వకంగా..**

పరిష్కరించలేని వాటికి ఎందుకు పరిష్కరించలేకపోతున్నామనే విషయాన్ని లిఖిత పూర్వకంగా దరఖాస్తుదారులకు తెలియజేస్తామని, ఎప్పటికీ పరిష్కారం కానివి ఉంటే అసలు పరిష్కార యోగ్యం లేనివి అక్రమమైనవి ఉంటే అవి పరిష్కారం కావు అని చెప్పడం జరుగుతుందని తెలిపారు. సాదాబైనామాలకు సంబంధించిన అంశం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉందని, కోర్టులో స్టే వెకేట్ అయిన వెంటనే ఈ సమస్యకు పరిష్కారం చూపిస్తామని వెల్లడించారు. భూ సమస్యలకు పూర్తి స్థాయిలో పరిష్కారం చూపాలి అనేది భూ భారతి చట్టం లక్ష్యమన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడానికి గత ఏడాదిన్నర కాలంగా రెవెన్యూ విభాగంలో చేపట్టిన సంస్కరణలు, తీసుకున్న నిర్ణయాలకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తుందన్నారు. భారతి చట్టాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారని హర్షించారు. ఈ చట్టం వల్ల తమ సమస్యలు పరిష్కారమవుతున్నాయన్న సంతోషం వారిలో కనపడుతుందన్నారు. అలాగే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందన్నారు. గత ప్రభుత్వం చేసిన నిర్వాకం వల్ల మొత్తం రెవెన్యూ సేవలు ప్రజలకు దూరమయ్యాయని విమర్శించారు. మొత్తం వ్యవస్థను ప్రజలకు చేరువు చేసి వారికి మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా మన ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

**గవర్నర్‌తో మంత్రి భేటీ**

అంతకుముందు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ భేటీలో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామ్‌రెడ్డి కూడా పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన భూభారతి చట్టం అమలు, ఇందిరమ్మ ఇండ్ల పథకం గురించి గవర్నర్‌కు మంత్రి సవివరంగా వివరించారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ఈ ఏడాది ప్రతి నియోజకవర్గానికి 3500 చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇండ్లను మంజూరు చేస్తున్నామని వివరించారు. గిరిజన నియోజకవర్గాలకు అదనంగా 500 నుంచి 700 ఇండ్లను మంజూరు చేస్తున్నామన్నారు.

## సీజేఐగా జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రమాణం
### ప్రమాణ స్వీకారం చేయించిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మూ

ప్రధాని మోదీ, ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా హాజరు

సుప్రీం కోర్టు రెండో దళిత న్యాయమూర్తిగా గవాయ్ రికార్డ్..

కీలకమైన రాజకీయ కేసుల్లో తన తీర్పులకు ప్రసిద్ధి

**ఢిల్లీ:** సుప్రీంకోర్టు 52వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బీఆర్ గవాయ్ బుధవారం ఉదయం ప్రమాణ స్వీకారం చేశారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు రాష్ట్రపతి ద్రౌపది ముర్మ. 2025 నవంబర్ వరకు, అంటే ఆరు నెలల పాటు సీజేఐగా జస్టిస్ గవాయ్ పనిచేయనున్నారు. సుప్రీంకోర్టు 51వ ప్రధాన న్యాయమూర్తిగా మంగళవారం పదవీ విరమణ చేసిన జస్టిస్ సంజీవ్ ఖన్నా స్థానంలో జస్టిస్ గవాయ్ బాధ్యతలు చేపట్టారు. దళిత సామాజికవర్గం నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అయిన రెండో వ్యక్తి జస్టిస్ గవాయ్. ఆయన కంటే ముందు మాజీ సీజేఐ కేజీ బాలకృష్ణన్ 2007లో తొలి దళిత సీజేఐ అయ్యారు.

**కీలకమైన తీర్పులు..**

జస్టిస్ గవాయ్ అత్యంత కీలకమైన రాజకీయ కేసుల్లో తన తీర్పులకు ప్రసిద్ధి చెందారు. తరచుగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పిటిషనర్‌కి ఉపశమనం కల్పిస్తారని అంటూ ఉంటారు.న్యూస్‌క్లిక్ వ్యవస్థాపక ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్థ, ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీష్ సిసోడియాతో సహా చారిత్రాత్మక తీర్పుల్లో, జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం చట్టవ్యతిరేక కార్యకలాపాల (నివారణ) చట్టం (యూఏపీఏ), మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) వంటి కఠినమైన చట్టాలలో ఏకపక్ష అరెస్టులకు వ్యతిరేకంగా విధానపరమైన రక్షణలను ఏర్పాటు చేసింది. సరైన ప్రక్రియను పాటించకుండా పౌరుల ఆస్తులను కూల్చివేయడం చట్ట విరుద్ధం అని 2024 నవంబర్‌లో ఆయన నేతృత్వంలోని ధర్మాసనం అభిప్రాయపడింది. గత ఏడాది ఫిబ్రవరిలో ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని రద్దు చేసిన ధర్మాసనంలో జస్టిస్ గవాయ్ సభ్యుడిగా ఉన్నారు. జమ్మూకశ్మీర్‌కి ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని కేంద్రం రద్దు చేయడాన్ని సమర్థించిన మరో రాజ్యాంగ ధర్మాసనంలో (2023 డిసెంబర్‌లో) కూడా ఆయన సభ్యుడిగా ఉన్నారు. వీటితో పాటు జస్టిస్ గవాయ్ 2016లో యూనియన్ తీసుకున్న నోట్ల రద్దు నిర్ణయాన్ని సమర్థిస్తూ మెజారిటీ అభిప్రాయాన్ని రాశారు.

# బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో..





- ఓరుగల్లు అందాలకు ప్రపంచ ముద్దుగుమ్మలు ఫిదా
- బతుకమ్మ, డోలు- సన్నాయి ఆటపాటలతో ఘనస్వాగతం
- తెలుగుదనం ఉట్టిపడేలా పట్టు పరికిణీ లో సందడి
- వెయి స్తంభాల గుడి, రామప్ప ఆలయాల సందర్శన
- శిల్పాల హోయలకు ముగ్ధులైన మిస్ వరల్డ్ బ్యూటీస్
- నేడు యాదగిరిగుట్టకు ప్రపంచ సుందరాంగులు




**మహా:** కాకతీయుల కళా వైభవానికి ప్రపంచ ముద్దుగుమ్మలు ఫిదా అయ్యారు. మిస్ వరల్డ్ పోటీలలో భాగంగా ఓరుగల్లుకు చేరుకున్న అందాల భామలు రామప్ప, వేయి స్తంభాల గుడిని సందర్శించారు. చూపుతిప్పనివ్వని రామప్ప శిల్పాల హోయలకు ముగ్ధులయ్యారు. వేయి స్తంభాల ఆలయమంతా కలియ తిరిగిన సుందరీమణులు నిర్మాణ నైపుణ్యానికి ఆశ్చర్యపోయారు. సంప్రదాయ దుస్తుల్లో హాజరైన ముద్దుగుమ్మలు ఇరు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే వరంగల్ హరిత హోటల్‌లో సందడి చేశారు. హోటల్ ప్రధాన ద్వారం ముందు బతుకమ్మ ఆడారు. బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో.. అంటూ బతుకమ్మ ఆడారు. డోలు సన్నాయిలతో సుందరిమణులకు జిల్లా అధికారులు స్వాగతం పలికారు. ఆ తర్వాత తెలుగుదనం ఉట్టిపడేలా పట్టుపరికిణిలో సందడి చేశారు. 'తెలంగాణ జరూర్ ఆనా' పేరుతో నిర్వహిస్తున్న మిస్ వరల్డ్ పోటీలు అట్టహాసంగా సాగుతున్నాయి. పర్యాటకుల స్వర్గధామంగా పిలుచుకునే ఓరుగల్లు వైభవాన్ని ప్రపంచ సుందరీమణులు ఆస్వాదిస్తున్నారు. మిస్ వరల్డ్ పోటీలలో భాగంగా 57 మంది ముద్దుగుమ్మలు వరంగల్‌కు చేరుకున్నారు. హనుమకొండలోని హరిత హోటల్‌లో దిగిన అందగత్తెలకు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, సీపీ సన్‌ప్రీత్ సింగ్‌తో పాటు మహిళలు బతుకమ్మలు, మేళతాళాలతో సాదర స్వాగతం పలికారు.

### నేడు యాదగిరిగుట్ట

మిస్ వరల్డ్ పోటీదారుల్లోని ఓ బృందం ములుగు జిల్లాలోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయాన్ని సందర్శించింది. గిరిజన సంప్రదాయ కొమ్ము కోయ నృత్యాల ప్రదర్శనలతో అధికార యంత్రాంగం స్వాగతం పలికింది. చీరకట్టులో ఆలయానికి వచ్చిన ముద్దుగుమ్మల హోయలొలికే రామప్ప శిల్ప సౌందర్యానికి ముగ్ధులయ్యారు. శతాబ్దాలు దాటినా చెక్కు చెదరకుండా సాండ్ బాక్స్ టెక్నాలజీతో నిర్మితమైన రామప్ప ఆలయ ప్రత్యేకతను తెలుసుకున్నారు. నీటిలో తేలియాడే ఇటుకలను స్వయంగా చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ప్రత్యేక పూజలు చేసి రామలింగేశ్వర స్వామి ఆశీస్సులు తీసుకున్నారు. మరో బృందం హనుమకొండలోని వేయి స్తంభాల గుడిని సందర్శించింది. ఆలయం ముందున్న నంది వద్ద అందరూ కలిసి ఫోటోషూట్ నిర్వహించారు. నంది చెవిలో తమ కోరికలు చెప్పుకున్న సుందరీమణులు వేయి స్తంభాల ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కాకతీయుల కళా వైభవంతో పాటు పేరిణి, గుస్సాడీ, కూచిపూడి నృత్యాలను మిస్‌వరల్డ్ పోటీదారులు తిలకిస్తున్నారు. కళ్లు చెదిరే లేజర్ షో, లైటింగ్ షోలను వీక్షించనున్నారు. అనంతరం హరిత హోటల్‌లో చేయి తిరిగిన చెఫ్‌లు చేసిన తెలంగాణ ప్రత్యేక వంటకాలను ఆస్వాదించనున్నారు. సుందరాంగుల పర్యటన దృష్ట్యా పోలీసులు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి క్షేత్రాన్ని నేడు ప్రపంచ సుందరీమణులు దర్శించుకోనున్నారు. సాయంత్రం 5 గంటలకు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారిని దర్శించుకునేందుకు మిస్‌వరల్డ్ పోటీదారులు రానున్నారు. యాదగిరిగుట్ట ఆధ్యాత్మిక క్షేత్రం ప్రపంచస్థాయి ఈ ప్రపంచ సుందరీమణుల సందర్శనతో గొప్ప స్థాయిలో గుర్తింపు సాధించి టూరిజం స్పాట్‌లో గొప్పగా నిలవనుంది.





# ఫేక్ ప్రచారాలు నమ్మొద్దు

## నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

పక్కాగా రాజీవ్ యువ వికాసం స్కీమ్ అమలు

ఆదాయం లేకపోయినా అప్పులకు వడ్డీలు చెల్లిస్తున్నాం

ధనిక రాష్ట్రాన్ని బీఆర్ఎస్ రూ. 7 లక్షల కోట్ల అప్పులు చేసింది

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

**మధిర మహా:** పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నిరుపేదలకు ఇండ్లు ఇస్తామని మభ్య పెట్టిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇండ్లు లేని వారికి ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తున్నామన్నారు. బుధవారం మధిర నియోజకవర్గం ఎర్రుపాలెంలో మీడియాతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఆశించిన స్థాయిలో ఆదాయం లేకపోయినా అప్పులకు మాత్రం క్రమం తప్పకుండా వడ్డీలు చెల్లిస్తూనే ఉన్నామని తెలిపారు. ధనిక రాష్ట్రాన్ని బీఆర్ఎస్ చేతిలో పేడితే రూ. 7 లక్షల కోట్ల అప్పులు చేసి వెళ్లిపోయిందని ఆరోపించారు. ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టినా.. రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ పథకాలను సమర్ధవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. 90 లక్షల కుటుంబాలకు సన్న బియ్యం అందజేస్తున్నామన్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా రూ.9 వేల కోట్లతో రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రారంభించామని పేర్కొన్నారు.

**ఆందోళన అవసరం లేదు..**

జూన్ 2న లబ్ధిదారులకు రాజీవ్ యువ వికాసం పథకం ఆర్థిక సాయానికి సంబంధించి ధ్రువీకరణ పత్రాలను అందజేస్తామన్నారు. రాజీవ్ యువ వికాసం స్కీమ్‌కు సంబంధించి సోషల్ మీడియాలో సిబిల్ స్కోర్ పేరుతో అసత్య ప్రచారం జరుగుతోందని ఆయన మండిపడ్డారు. ఫేక్ ప్రచారాలను ఎవరూ నమ్మొద్దని యువతకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇచ్చేందుకు ప్రభుత్వం రూ.22,500 కోట్లు ఖర్చు చేస్తుందని తెలిపారు. ఇళ్లు లేని వాళ్లు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. ఇక వ్యవసాయం, ఉచిత విద్యుత్ కోసం ప్రభుత్వం ఏటా రూ. 12,500 కోట్లు ఖర్చు చేస్తోందని పేర్కొన్నారు. ఈనెల 18న నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేటలో సీఎం రేవంత్ రెడ్డి పథకాన్ని ప్రారంభించబోతున్నారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

### హలో రాహుల్ జీ..బుల్డోజర్ కంపెనీలతో

# మీకేమైనా డీల్సా?


## ప్రతిరోజూ పేదల ఇళ్లపై దాడి చేయడం ఏమిటి?

అందాల పోటీల కోసం పేదల ఇళ్ల ధ్వంసం ప్రజాపాలననా?

ఎక్స్‌లో బీఆర్ఎస్ నేత కేటీఆర్ ట్వీట్



**మహా:** కాంగ్రెస్ విధానంపై ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి సామాజిక మాధ్యమం ఎక్స్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పలు ప్రశ్నలు సంధించారు. మిస్ వరల్డ్ పోటీలో పాల్గొంటున్న వారి పర్యటన కోసం పేదల ఇళ్లు కూల్చుతున్నారంటూ మండిపడ్డారు. వరంగల్‌లో కూల్చివేతలపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన.. అందాల పోటీల కోసం పేదల ఇళ్లను ధ్వంసం చేయడమే ప్రజాపాలననా అంటూ ఫైర్ అయ్యారు. వరంగల్‌లో దారి వెంట ఇళ్ల ధ్వంసంపై కేటీఆర్ మండిపడ్డారు. కూల్చివేతలకు సంబంధించిన వీడియోను ఎక్స్‌లో పోస్ట్ చేసిన కేటీఆర్.. దీనికి సంబంధించి రాహుల్ గాంధీకి పలు ప్రశ్నలు సంధించారు. తెలంగాణ ప్రభుత్వ అమానవీయ చర్యలపై రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 'హలో రాహుల్ గాంధీ, బుల్డోజర్ కంపెనీలతో మీకేమైనా రహస్య ఒప్పందం ఉన్నదా. ప్రతిరోజూ పేదల ఇళ్లతో పాటు వారి జీవితాలపై దాడి చేయడం ఏమిటి. అందాల పోటీల కోసం పేదవారి ఇళ్లను ధ్వంసం చేయడమే ప్రజాపాలననా. రూ.200 కోట్ల ప్రజా సొమ్ము ఖర్చుపెట్టి రాజభవనాల్లో విందులు పెట్టడం ప్రజాపాలనా. పేద ప్రజల జీవితాలు రాక్షస బుల్డోజర్ల కింద నలిగిపోతున్నాయి. పేదల ఇళ్లపై బుల్డోజర్లు నడిపిస్తున్న సిగ్గులేని కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలి' అంటూ మాజీ మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు.



# కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

## గుజరాత్ లో సెమీకండక్టర్ యూనిట్ ఏర్పాటుకు రూ.3,300 కోట్లు

**మహా :** ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో కేంద్రం కీలక నిర్ణయాలు తీసుకుంది. ఆపరేషన్ సిందూర్ తర్వాత జరిగిన ఈ తొలి కేబినెట్ మీటింగ్ లో సెమీ కండక్టర్ ఇండస్ట్రీకి ప్రోత్సాహమిచ్చేలా ఆమోదం లభించింది. యూపీలోని జేవర్లో 6వ సెమీ కండక్టర్ యూనిట్ ను నిర్మించేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిందని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఇందుకు రూ.3,706 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. గుజరాత్ లోని సనంద్ లో సెమీకండక్టర్ యూనిట్ ఏర్పాటుకు రూ.3,300 కోట్లు, చంద్రయాన్ 4 మిషన్ కు రూ.2,104 కోట్లు, మిషన్ వీనస్ కు రూ.1236 కోట్లు, డెవలప్ మెంట్ ఆఫ్ నెక్స్ట్ జనరేషన్ ఆఫ్ శాటిలైట్ లాంచ్ వెహికల్ కు రూ.8,240, గగన్ యాన్ ఫాలోకు రూ.20,193 కోట్లు, నేషనల్ ఫోరెన్సిక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఎన్ హాన్స్మెంట్ స్కీమ్ కు రూ.2,254 కోట్లు, విగ్యాన్ ధారకు రూ.10,579 కోట్లు, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఫర్ క్రియేటివ్ టెక్నాలజీస్ కు రూ.391 కోట్లు, బయో E3 పాలసీ ఫర్ బయో మాను ఫ్యాక్చరింగ్ కు రూ.1500 కోట్లు, వెంచర్ క్యాపిటల్ ఫండ్ ఫర్ స్పేస్ సెక్టార్ అండర్ ఏజిస్ ఆఫ్ కు రూ.1000 కోట్లు కేటాయించేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటితోపాటు బెంగళూరు, నోయిడాలో చిప్స్ హబ్స్ ఏర్పాటుకు, తిరుపతిలో ఐఐటీ విస్తరణకు సైతం కేబినెట్ ఆమోదం తెలిపింది.

# భార్గవాస్త్ర టెస్ట్ సక్సెస్

## స్వదేశీ డ్రోన్ కిల్లర్ ను రూపొందించిన భారత్

రాకెట్ కు మూడు పరీక్షలు.. త్వరలో భారత వాయుసైన్యంలోని నూతన అస్త్రం

**ఢిల్లీ, మహా:** దేశంలో పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్ ఉగ్రవాదుల స్థావరాలపై దాడి చేసిన క్రమంలో పాకిస్తాన్ కూడా డ్రోన్లు, క్షిపణులను ఉపయోగించి దాడులు చేసింది. ఈ క్రమంలో భారతదేశం అన్ని రకాల దాడులను భగ్నం చేసింది. ఈ నేపథ్యంలో ఒడిశాలోని గోపాల్‌పూర్‌లో స్వదేశీ డ్రోన్ నిరోధక వ్యవస్థ 'భార్గవాస్త్రను భారతదేశం విజయవంతంగా పరీక్షించింది. సోలార్ డిఫెన్స్ అభివృద్ధి చేసిన ఈ వ్యవస్థ 2.5 కి.మీ. దూరం ఉన్న డ్రోన్ సమూహాలను సులభంగా నాశనం చేయగలదు. మైక్రో రాకెట్లు, క్షిపణులతో కూడిన ఈ వ్యవస్థ భారతదేశ వైమానిక రక్షణను బలోపేతం చేస్తుందని ఆయా వర్గాలు చెబుతున్నాయి. బుధవారం ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించాయి.

### మూడు పరీక్షలు

మే 13న గోపాల్‌పూర్‌లో సీనియర్ ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ అధికారుల సమక్షంలో ఈ రాకెట్‌కు మూడు పరీక్షలు జరిగాయి. ఒక్కొక్క రాకెట్‌ను ప్రయోగించడం ద్వారా రెండు పరీక్షలు నిర్వహించారు. 2 సెకన్లలోపు సాల్వో మోడ్‌లో రెండు రాకెట్లను ప్రయోగించడం ద్వారా ఒక పరీక్ష నిర్వహించబడింది. నాలుగు రాకెట్లు అంచనా వేసిన విధంగా పనిచేశాయి. ఆ క్రమంలో అవసరమైన ప్రయోగ పారామీటర్లను సాధించాయి. దీనిని సముద్ర మట్టానికి 5,000 మీటర్ల పైన ఉన్న ప్రాంతాలతో సహా విభిన్న భూభాగాలలో సజావుగా మోహరించడానికి రూపొందించారు.




### 'భార్గవాస్త్ర' స్పెషల్ ఇదే

'భార్గవాస్త్ర' అనేది యాంటీ డ్రోన్ వ్యవస్థ. ఇది వేగంగా వచ్చే డ్రోన్‌లను గుర్తించి నాశనం చేయగలదు. ఇది 6 నుంచి 10 కి.మీ. దూరంలో ఉన్న చిన్న డ్రోన్‌లను గుర్తించగలదు. ఇందులో రాడార్, ఎలక్ట్రోఆప్టికల్/ఇన్‌ఫ్రారెడ్ (ఈవో/ఐఆర్) సెన్సార్, RF రిసీవర్ ఉంటాయి. ఇది 2.5 కి.మీ. దూరంలోని డ్రోన్‌లను నాశనం చేయగలదు. 20 మీటర్ల ప్రాణాంతక వ్యాసార్థం ఉంటుంది. మొదటగా డ్రోన్ సమూహాలను నాశనం చేయడానికి సిద్ధం చేశారు. రెండో దశలో ఖచ్చితమైన దాడి కోసం ఇప్పటికే పరీక్షించబడింది. డ్రోన్‌లను నాశనం చేయకుండా వాటిని నిలిపివేయగల జామింగ్, స్పూఫింగ్ వంటి సౌకర్యాలు కూడా దీనిలో ఉన్నాయి.

### ప్రత్యేకమైన వ్యవస్థ..

భార్గవాస్త్రను దీని డెవలపర్లు ప్రపంచ స్థాయిలోనే ఒక ప్రత్యేకమైన వ్యవస్థగా అభివర్ణించారు. అనేక అభివృద్ధి చెందిన దేశాలు సూక్ష్మ క్షిపణి వ్యవస్థలపై పనిచేస్తున్నప్పటికీ, తక్కువ ఖర్చుతో డ్రోన్ సమూహాలను నాశనం చేయగల ఇలాంటి వ్యవస్థ ఇంకా రాలేదన్నారు. ఈ వ్యవస్థ 64 గైడెడ్ మైక్రో క్షిపణులను ఒకేసారి ప్రయోగించగలదు. కమాండ్, కంట్రోల్, కమ్యూనికేషన్స్, కంప్యూటర్స్, ఇంటెలిజెన్స్ సాంకేతికతతో కూడిన ఈ వ్యవస్థ, సింగిల్ డ్రోన్లు లేదా మొత్తం సమూహాలను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉంది. ఇందులోని సెన్సార్లు తక్కువ రాడార్ క్రాస్ సెక్షన్ లక్ష్యాలను కచ్చితంగా గుర్తించేలా చేస్తుంది. భారత సైన్యం త్వరలో దీనిని తన వాయు రక్షణ వ్యవస్థలో చేర్చాలని యోచిస్తోంది.

# ప్లీజ్ నీళ్లివ్వండి

## తాగు నీరుకు అల్లాడిపోతున్నాం

మా దేశ ప్రజల నోళ్లు ఎండిపోతున్నాయి

సింధూ జలాల రద్దుపై నిర్ణయం వెనక్కి తీసుకోండి

కాళ్ల బేరానికి వచ్చిన దాయాది పాకిస్థాన్

భారత జలశక్తి మంత్రిత్వ శాఖకు పాక్ జలవనరుల శాఖ లేఖ

**మహా:** అనుకున్నదే జరిగింది. ఊహించినట్లుగానే దాయాది పాకిస్థాన్ కాళ్ల బేరానికి వచ్చింది. సింధూ జలాల ఒప్పందాన్ని రద్దు చేయడాన్ని మళ్లీ సమీక్షించి నిర్ణయం వెనక్కి తీసుకోవాలని భారత్‌ను వేడుకుంది. ఈ మేరకు లేఖను భారత ప్రభుత్వానికి పంపింది. తాము తీవ్రమైన నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నామని పాకిస్తాన్ చెప్పింది. అయితే పెహల్గాంలో తీవ్రవాదులు భారతీయ పర్యాటకుల్ని కాల్చి చంపిన తర్వాత పాకిస్థాన్‌లో అన్ని రకాల సంబంధాలను తెంపుకోవాలని భారత్ నిర్ణయించింది. ఇందులో భాగంగా సింధూనది పంపిణీ ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. ఈ అంశంలో జోక్యం చేసుకోవడానికి ప్రపంచ బ్యాంకుకే అధికారం ఉంది. ప్రపంచ బ్యాంకు కూడా జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది. దీంతో పాకిస్థాన్‌కు నీళ్లు ఆగిపోయాయి. అప్పట్నుంచి పాకిస్థాన్ తీవ్ర సమస్యల్లో ఉంది. సింధూ జలాల వల్లనే సగం పాకిస్థాన్ నీళ్లు తాగుతోంది. అలాగే వ్యవసాయం చేసుకుంటోంది. ఆ నీటిని ఆపేస్తే.. వ్యవసాయం కూడా సాగే అవకాశం ఉండదు. ఈ పరిస్థితి అప్పుడే కనిపిస్తూండటంతో పాకిస్తాన్ కాళ్ల బేరానికి వచ్చినట్లుగా తెలుస్తోంది.

### ప్రభుత్వం నిర్ణయంపై ఉత్కంఠ

సింధూ జలాలు నిలిపివేస్తే పాక్‌లో తీవ్ర దుర్భిక్షం నెలకొంటుందంటూ భారత జలశక్తి మంత్రిత్వ శాఖకు పాక్ జలవనరుల శాఖ లేఖ రాసినట్లు సమాచారం.



ఈ విషయంలో చర్చించేందుకు పాక్ సిద్ధంగా ఉందని పేర్కొంది. ప్రోటోకాల్‌లో భాగంగా ఈ అంశాన్ని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు పంపినట్లు తెలుస్తోంది. అయితే, రక్తం, నీరు రెండూ కలిసి ప్రవహించలేవంటూ ఈ విషయంలో వెనక్కి తగ్గేది లేదని ప్రధాని మోదీ ఇప్పటికే స్పష్టం చేశారు. పాక్‌తో చర్చలంటూ జరిగితే ఉగ్రవాదం, పాక్ ఆక్రమిత కశ్మీర్‌పైనే అని పేర్కొన్నారు. పాకిస్థాన్ సింధూ జలాల ఒప్పందం సస్పెన్షన్‌కు వ్యతిరేకంగా రాయబార నోటీసు లేదా లేఖ పంపేందుకు సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. భారత్ ఇండస్ ట్రీటిని క్యాన్సిల్ చేసి నీళ్లను ఆపేసింది. ఈ కారణంగా సింధూ నదిపై డ్యాములన్నీ నిండిపోయాయి. వాటిని నిల్వ చేసుకోవడానికి అవసరమైనంత మౌలిక సదుపాయాలు లేవు. ఈ కారణంగా కిందకు నీరు పంపాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఈ క్రమంలో పాకిస్థాన్‌కు వరదలు వచ్చేలా గతంలో ఒక్కసారే రిలీజ్ చేసింది. మానవతా దృక్పథంతో నీటిని విడుదల చేస్తారా అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది.

# భారత్ సాధించింది మామూలు విజయం కాదు

## యుద్ధతంత్ర నిపుణుడు జాన్ స్పెన్సర్.. రాజ్య ప్రేరేపిత ఉగ్రవాదంపై భారత్ రెడ్ లైన్

ఆపరేషన్ సింధూర్ పై యుద్ధతంత్ర నిపుణులు, పరిశోధకులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఆధునిక యుద్ధరీతుల్లో భారత్ గొప్ప విజయం సాధించిందని పేర్కొంటున్నారు. భారతదేశం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' దేశ సైనిక సిద్ధాంతంలో ఒక నిర్ణయాత్మక మార్పును సూచిస్తోందని, కచ్చితమైన వైమానిక దాడులను వ్యూహాత్మక సంయమనంతో మేళవించిందని అంతర్జాతీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఆధునిక యుద్ధ తంత్రాలపై ప్రపంచంలోని అగ్రగామి నిపుణులలో ఒకరైన వెస్ట్ పాయింట్ కు చెందిన జాన్ స్పెన్సర్, ఈ ఆపరేషన్‌ను 'నిష్పాక్షిక విజయం'గా అభివర్ణించారు. ఇది సాధారణ విజయం కాదు... భారీ విజయం అని పేర్కొన్నారు. దాని స్పష్టత, అమలు తీరును ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ చర్య ద్వారా భారత్ ఉగ్రవాద మౌలిక సదుపాయాలను ధ్వంసం చేయడమే కాకుండా, పాకిస్థాన్ ప్రతిదాడులను సమర్థవంతంగా నిర్వీర్యం చేసి, తన రెసిస్టెన్స్ పవర్ ను పునర్నిర్వచించిందని ఆయన పేర్కొన్నారు. పూర్తిస్థాయి యుద్ధానికి దిగకుండానే, రాజ్య ప్రేరేపిత ఉగ్రవాదంపై భారత్ తన దృఢ సంకల్పాన్ని తెలియజేస్తూ ఒక కొత్త 'రెడ్ లైన్' గీసిందని తెలిపారు.

### జాన్ స్పెన్సర్ విశ్లేషణ...

కేవలం నాలుగు రోజుల నియంత్రిత సైనిక చర్యతో భారతదేశం భారీ విజయాన్ని సాధించింది. ఆపరేషన్ సిందూర్ తన వ్యూహాత్మక లక్ష్యాలను చేరుకోవడమే కాకుండా, వాటిని అధిగమించింది. ఉగ్రవాద మౌలిక సదుపాయాలను నాశనం చేయడం, సైనిక ఆధిపత్యాన్ని ప్రదర్శించడం, నిరోధక శక్తిని పునరుద్ధరించడం మరియు నూతన జాతీయ భద్రతా సిద్ధాంతాన్ని ఆవిష్కరించడం వంటివి ఇందులో ఉన్నాయి.






ఇది కేవలం ప్రతీకాత్మక శక్తి ప్రదర్శన కాదు. ఇది నిర్ణయాత్మక శక్తి, స్పష్టంగా వర్తింపజేయబడింది" అని జాన్ స్పెన్సర్ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు.

### భారత వ్యూహాత్మక పరివర్తన

ఏప్రిల్ 22న జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన దారుణమైన ఉగ్రదాడిలో 26 మంది పౌరులు మరణించారు. ఈ దాడికి లష్కరే తోయిబా అనుబంధ సంస్థ అయిన "ది రెసిస్టెన్స్ ఫ్రంట్" బాధ్యత వహించింది. గత సంఘటనలకు భిన్నంగా, న్యూఢిల్లీ దౌత్యపరమైన హెచ్చరికలు జారీ చేయడం లేదా బహుపాక్షిక ఖండనలను కోరడం వంటివి చేయలేదు. బదులుగా, యుద్ధ విమానాలను ప్రయోగించిందని స్పెన్సర్ తన పోస్ట్‌లో తెలిపారు. మే 7న ప్రారంభమైన నాలుగు రోజుల పాటు అత్యంత సమన్వయంతో, భారత్ తొమ్మిది లోతైన చొచ్చుకెళ్లే దాడులను నిర్వహించింది. పాకిస్థాన్ నుంచి వచ్చిన డ్రోన్ల సమూహాన్ని నిర్వీర్యం చేసి, ఆరు సైనిక వైమానిక స్థావరాలు మరియు యూఏవీ కమాండ్ హబ్‌లను లక్ష్యంగా చేసుకుంది. దీనికి సమాంతరంగా, భారత సాయుధ దళాలు తమ గగనతలాన్ని రక్షించుకునే సామర్థ్యాన్ని, స్వదేశీ ఆయుధ వ్యవస్థలను మోహరించే తీరును, ఎలక్ట్రానిక్ మరియు సైబర్ యుద్ధంతో సహా బహుళ క్షేత్ర సామర్థ్యాలను ప్రదర్శించాయి. ఆ తర్వాత కాల్పుల విరమణ చోటుచేసుకుంది. భారత సైనిక అధికారుల మాటల్లో చెప్పాలంటే, ఇది 'వ్యూహాత్మక విరామం' - కార్యాచరణ విరమణ మాత్రమే. ఈ పరిమితమైన, శక్తివంతమైన వైఖరినే స్పెన్సర్ ప్రముఖంగా ప్రస్తావించారు.

### వ్యూహాత్మక లక్ష్యాల సాధన

స్పెన్సర్ ప్రకారం, ఆపరేషన్ సింధూర్ భూభాగాన్ని ఆక్రమించుకోవడానికి లేదా ప్రతీకారం తీర్చుకోవడానికి జరిగిన యుద్ధం కాదు, స్పష్టమైన లక్ష్యాలతో కూడిన పరిమిత ప్రచారం, మరియు అవన్నీ నెరవేరాయి

### సైనిక ఆధిపత్యం

**ఉగ్రవాద మరియు సైనిక లక్ష్యాలపై ఇష్టానుసారం దాడి చేయగల భారత సామర్థ్యం, పాకిస్థాన్ ప్రతిదాడులను నిర్వీర్యం చేయడం, ఇరు దేశాల సామర్థ్యాల మధ్య ఉన్న స్పష్టమైన అసమానతను నొక్కి చెప్పింది. ఉద్దేశపూర్వకంగా ఉద్రిక్తతను పెంచి, పూర్తిస్థాయి యుద్ధానికి కొద్ది దూరంలో ఆపడం ద్వారా, సంఘర్షణ వేగం మరియు పరిధిపై తన నియంత్రణను భారత్ సూచించింది. ఆపరేషన్ సింధూర్‌తో, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బహిరంగంగా ప్రకటించినట్లుగా, "భారత్ ఎలాంటి అణ్వస్త్ర బెదిరింపులను సహించదు. అణ్వస్త్ర బెదిరింపుల ముసుగులో అభివృద్ధి చెందుతున్న ఉగ్రవాద స్థావరాలపై భారత్ కచ్చితంగా, నిర్ణయాత్మకంగా దాడి చేస్తుంది" అనే నూతన జాతీయ భద్రతా సిద్ధాంతాన్ని భారత్ ఆవిష్కరించింది... అని స్పెన్సర్ వివరించారు.**

### కొత్త రెడ్ లైన్

పాకిస్థాన్ భూభాగం నుంచి జరిగే ఉగ్రవాద దాడులను యుద్ధ చర్యలుగా పరిగణిస్తామని, భవిష్యత్ ప్రతిస్పందనలకు ఒక ప్రమాణాన్ని నిర్దేశిస్తామని భారత్ స్థాపించింది. ప్రధాని మోదీ చెప్పినట్లుగా, "ఉగ్రవాదం, చర్చలు కలిసి సాగవు. నీరు, రక్తం కలిసి ప్రవహించవు." అనే సందేశాన్ని భారత్ చర్యల ద్వారా బలపరిచింది.

# పంచభూత శివలింగాలు ఎక్కడ ఉన్నాయో తెలుసా?

హిందూ సంస్కృతిలో పరమేశ్వరున్ని లింగ రూపంలో భక్తులు పూజిస్తారనే విషయం అందరికీ తెలిసిందే. ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో పరమశివుడికి సంబంధించి ఎన్నో మహిమాన్విత క్షేత్రాలు ఉన్నాయి. వాటిలో ప్రముఖంగా చెప్పుకోదగ్గవి పంచభూత శివలింగాలు. వీటిలో నాలుగు దేవాలయాలు తమిళనాడు రాష్ట్రంలో ఉండగా, ఒక దేవాలయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉంది. ముఖ్యంగా కార్తీక మాసంలో పరమేశ్వరుడి దివ్య క్షేత్రాలను సందర్శించేందుకు భక్తులు అధిక ప్రాధాన్యత ఇస్తారు. వన భోజనాలు చేసేందుకు వివిధ పుణ్య క్షేత్రాలకు వెళుతుంటారు. కాబట్టి మీ తీర్థయాత్ర పర్యటనల్లో పంచ భూత లింగాల సందర్శనను ఓ భాగం చేసుకోండి. లయ కారకుడైన శివుని పంచభూత లింగాల యొక్క ప్రాముఖ్యత ఏమిటి? ఈ క్షేత్రాల ప్రత్యేకతలు ఏమిటి? ప్రయాణ సమయం? తదితర విషయాల గురించి ఇక్కడ తెలుసుకోండి.

**1. ఆకాశ లింగం:**
**చెన్నై నుంచి దూరం: 229 కిలోమీటర్లు**
**ప్రయాణ సమయం: 4 నుంచి 4 ½ గంటలు**

పరమేశ్వరుని అతి పవిత్రమైన పంచభూత లింగాలలో ఆకాశ లింగం ఒకటి. ఆకాశతత్వానికి ప్రతీకగా ఇక్కడి శివలింగాన్ని పూజిస్తారు. ఈ ఆలయంలో 9 గోపురాలు ఉంటాయి. వీటిని మనిషిలోని నవరంధ్రాలకు ప్రతీకగా చెబుతారు. 40 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ ఆలయం శైవ, విష్ణు భక్తులకు ఎంతో ప్రత్యేకమైనది. ఈ ప్రాచీన దేవాలయం శివుని నటరాజ స్వరూపంతో పాటు గోవిందరాజ పెరుమాళ్లుకు సంబంధించినది. ఇక్కడ పరమశివుడు మూడు రూపాల్లో దర్శనమిస్తాడు. శివుడి శాస్త్రీయ రూపమైన లింగానికి భిన్నంగా ఇక్కడ స్వర్ణాలంకార భూషితుడైన నటరాజస్వామి రూపంలో పరమశివుడు ఉంటాడు. చంద్రమౌళీశ్వర స్పటిక లింగం, రూపం లేని



దైవ సాన్నిధ్యం అనే రూపాల్లోనూ పరమేశ్వరుడు దర్శనమిస్తాడు. పరమేశ్వరుని మూడవ రూపాన్నే చిదంబర రహస్యం అంటారు. ఈ ప్రదేశాన్ని యంత్రం చిత్రం కలిగిన తెరతో కప్పి ఉంచుతారు. దీని వెనుక ఎలాంటి ఆకారం లేని శూన్యం మాత్రమే ఉంటుంది. దీనినే ఆకాశ తత్వానికి ప్రతీకగా భావిస్తారు. తెరను తొలగించినప్పుడు బంగారు బిల్వ పత్రాల వరుసలు స్వామి సమక్షాన్ని సూచిస్తాయి. తెరకు బయట వైపు ఉండే నలుపు అజ్ఞానాన్ని, లోపల వైపు ఉండే ఎరుపు జ్ఞానాన్ని సూచిస్తుంది.

**2. పృథ్వీ లింగం:**
**చెన్నై నుంచి దూరం: 72 కిలోమీటర్లు**
**ప్రయాణ సమయం: 2 గంటలు**

కంచిలో ఉన్న ఏకాంబరేశ్వర శివలింగం భూమిని సూచిస్తుంది. ఈ ఆలయానికి నాలుగు వైపులా నాలుగు గాలి గోపురాలు ఉంటాయి. భారతదేశంలోని అతిపెద్ద గాలి గోపురాలు గల ఆలయాల్లో ఇది ఒకటి. ఆలయం లోపల య్యి స్తంభాల నిర్మాణంతో పాటు 1,008 శివలింగాలు ప్రతిష్టించబడ్డాయి. ఇక్కడ 3,500 సంవత్సరాల వయస్సు గల మామిడి వృక్షం ఉంది. సంతానం లేని దంపతులు ఈ చెట్టు కింద నిలబడి కింద పడే పండును పట్టుకుని తింటే సంతానం కలుగుతుందని నమ్ముతారు. ఆమ్ర అంటే మామిడి అని అర్థం. మామిడి చెట్టు కింద వెలసిన దైవం కాబట్టి ఇక్కడి శివలింగాన్ని ఏకాంబరేశ్వర లింగంగా కొలుస్తారు.

**3. అగ్ని లింగం:**
**చెన్నై నుంచి దూరం: 185 కిలోమీటర్లు**
**ప్రయాణ సమయం: 3 నుంచి 4 గంటలు**

తమిళనాడు రాష్ట్రంలో అన్నామలై లేదా అరుణాచలం క్షేత్రం ఉంది. పంచ భూతాలలోని అగ్ని భూతానికి ఇది ప్రతీక. అరుణ అంటే ఎర్రని, అచలము అని కొండ అని అర్థం. దీన్ని బట్టి ఈ క్షేత్రానికి అరుణాచలము అనే పేరు వచ్చింది. కేవలం స్మరణంతోనే ముక్తిని ప్రసాదించే ప్రదేశంగా భక్తులు ఈ క్షేత్రాన్ని నమ్ముతారు. అరుణాచలం కొండ చుట్టూ ప్రదక్షిణ చేస్తే సాక్షాత్తు పరమశివుని చుట్టూ ప్రదక్షిణ చేసినట్లే అని పురాణాలు చెబుతున్నాయి. వేద, పురాణాల్లో ఈ క్షేత్రానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. శివాజ్ఞతో విశ్వకర్మ ఈ అరుణాచలేశ్వర దేవాలయాన్ని నిర్మించినట్లు కథనం. అక్కడ జరగాల్సిన క్రతువులు గౌతమ మహర్షిచే ఏర్పాటు చేయబడినట్లు అరుణాచల మహత్యం ద్వారా తెలుస్తుంది.

**4. జలలింగం:**
**చెన్నై నుంచి దూరం: 331 కిలోమీటర్లు**
**ప్రయాణ సమయం: 6 గంటలు**

తమిళనాడు రాష్ట్రంలోని తిరుచ్చికి 11 కిలోమీటర్ల దూరంలో జంబుకేశ్వర ఆలయం ఉంది. ఈ ఆలయానికి తిమేవకాయ్, తిరువనైకావల్ అనే పేర్లు కూడా ఉన్నాయి. పూర్వం ఇక్కడ జంబు వృక్షాలు అధికంగా ఉండడం వలన, ఏనుగుల చేత పూజలందుకున్న క్షేత్రం కావడం వలన ఈ ప్రదేశానికి జంబుకేశ్వరంగా పేరు వచ్చింది. ఈ దేవాలయం ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఎత్తైన 7 గోపురాలతో నిర్మించబడి ఉంటుంది. ఇక్కడ జంబుకేశ్వర లింగం పశ్చిమ ముఖంగా ఉంటుంది. నీటితో నిర్మితమైన ఈ లింగం నుంచి పానపట్టం నుంచి నిరంతరం నీరు ఊరుతూ ఉంటుంది. అందుకే పానపట్టంపై ఓ వస్త్రాన్ని కప్పుతారు. దీనిని కొద్ది సేపటి తర్వాత పిండి.. ఆ నీటిని భక్తులకు చూపిస్తారు.

**5. వాయు లింగం:**
**విజయవాడ నుంచి దూరం: 377 కిలోమీటర్లు**
**ప్రయాణ సమయం: 6 నుంచి 7 గంటలు**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూరు జిల్లాలో స్వర్ణముఖి నదికి తూర్పు ఒడ్డున శ్రీకాళహస్తి క్షేత్రం ఉంది. ఇక్కడి శివలింగాన్ని వాయు భూతానికి ప్రతీకగా కొలుస్తారు. దీనికి నిదర్శనంగా భక్తులు ఆలయ గర్భగుడిలో ఓ అద్భుతాన్ని వీక్షించవచ్చు. కర్పూర లింగంగా పిలిచే ఈ శివలింగం చుట్టూ అనేక దీపాలు నిశ్చలంగా ఉంటాయి. కానీ స్వామి వారి ఎదురుగా ఉండే దీపం మాత్రం ఎప్పుడూ రెపరెపలాడుతూ కనిపిస్తుంది. అందుకే ఈ లింగాన్ని ప్రాణ వాయు లింగంగా పూజిస్తారు. స్వామి ఉఛ్వాస నిశ్వాసల కారణంగానే ఇది జరుగుతుందని, ఇక్కడి లింగానికి ప్రాణం ఉందని భక్తులు విశ్వసిస్తారు. అందుకే ప్రపంచంలోనే ప్రాణం ఉన్న శివలింగ క్షేత్రంగా శ్రీకాళహస్తికి ప్రత్యేక గుర్తింపు ఉంది.



# టర్కీకి షాకిచ్చిన జేఎన్‌యూ

మహా : జాతీయ భద్రతా పరిగణనల కారణంగా టర్కిష్ విశ్వవిద్యాలయంతో తమ అవగాహన ఒప్పందాన్ని నిలిపివేసినట్లు జవహర్‌లాల్ నెహ్రూ ప్రధాన విశ్వవిద్యాలయం తెలిపింది. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్ట్ చేసింది. జేఎన్‌యూ వెబ్‌సైట్ ప్రకారం.. టర్కీలోని ఇనోను విశ్వవిద్యాలయం, జేయోన్‌యూ మధ్య 2025 ఫిబ్రవరి 3వ తేదీన అవగాహన ఒప్పందం జరిగింది. అయితే ఈ ఒప్పందం 2028 ఫిబ్రవరి 2 వరకు మూడేళ్ల పాటు అమల్లో ఉండాలని షెడ్యూల్ చేయబడింది. అయితే ఈ ఒప్పందాన్ని రద్దు చేసుకుంటున్నట్టు బుధవారం జేఎన్‌యూ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. జాతీయ భద్రతా కారణాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొంది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఇనోను విశ్వవిద్యాలయంతో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందం నిలిపివేయబడుతుందని జేఎన్‌యూ స్పష్టం చేసింది. అయితే భారత్‌కు వ్యతిరేకంగా తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తుందనే ఆరోపణలతో టర్కీకి చెందిన వార్తా ప్రసార సంస్థ "టిఆర్ టి వరల్డ్" ఎక్స్ ఖాతాలను భారత ప్రభుత్వం కొంతకాలం నిలిపివేసింది. అయితే అదే రోజు జేఎన్‌యూ కూడా టర్కీకి చెందిన యూనివర్సిటీలో ఒప్పందాన్ని నిలిపివేసింది.

## రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
9247580946

# బాయ్ కాట్ టర్కీ

## సినిమా షూటింగ్ లు బంద్.. ట్రావెల్స్ బంద్

**మహా:** భారత్, పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న సమయంలో టర్కీ (తుర్కియో) పాక్‌కు మద్దతు ఇచ్చిన నేపథ్యంలో భారతీయులలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతోంది. ఇప్పటికే కొంతమంది పండ్ల వ్యాపారులు టర్కీ యాపిల్స్‌ను దిగుమతి చేసుకోవడానికి నిరాకరించారు. బాయ్ కాట్ టర్కీ అనే క్యాంపెయిన్ కూడా రన్ అవుతోంది. ఈ నేపథ్యంలో టర్కీకి మరో ఎదురుదెబ్బ తగిలే సూచనలు కనిపిస్తున్నాయి. పాకిస్తాన్‌కు మద్దతు ఇస్తున్న టర్కీలో భారతీయ సినీ నిర్మాతలు షూటింగ్స్ పెట్టుకోవద్దని ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయీస్ అన్ని భారతీయ చిత్ర నిర్మాతలను కోరింది. భారత మీడియా, వినోద పరిశ్రమలోని 36 మంది కళాకారులు, సాంకేతిక నిపుణులు, కళాకారులకు ప్రాతినిధ్యం వహిస్తున్న అత్యున్నత సంస్థ బుధవారం ఈ అభ్యర్థన చేసింది. టర్కీ పాకిస్తాన్‌కు డ్రోన్‌లు సహా ఆయుధ వ్యవస్థలను అందించడంపై భారత ప్రజలు అసంతృప్తితో ఉన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా దిల్ ధడక్నే దో, గురు, కోడ్ నేమ్: తిరంగ, రేస్ 2, అజబ్ ప్రేమ్ కి గజబ్ కహానీ వంటి అనేక భారతీయ చిత్రాలు టర్కీలో షూటింగ్స్ జరుపుకున్నాయ. మన తెలుగు సినిమాల్లో మహేస్ బాబు దూకుడు కూడా టర్కీలో షూటింగ్ జరుపుకుంది. అంతేకాకుండా, అనేక టర్కిష్ షోలు, నటులకు ఇండియాలో భారీ ఫ్యాన్ బేస్ ఉంది. అయితే, పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత కూడా టర్కీ బహిరంగంగా పాకిస్తాన్ వైపు మొగ్గు చూపడంతో టర్కీపై ఇండియాలో వ్యతిరేకత మొదలైంది. సినిమా నిర్మాణాల కోసం టర్కీని ఎంపిక చేసుకోవద్దని నిర్మాతలను కోరడం కూడా ఆ దేశానికి దెబ్బగా చెప్పకోవచ్చు. సినిమా షూటింగ్స్ వల్ల టర్కీకి మంచి ఆదాయం వస్తోంది. ఇప్పుడా ఆ ఆదాయానికి గండి పడే సూచనలు కనిపిస్తున్నాయి.



# శివపార్వతుల దీవెనలతో.. ప్రజలు సుభిక్షంగా ఉండాలి

■ శ్రీ అన్నపూర్ణ విశ్వేశ్వర స్వామి ఆలయం విగ్రహ ప్రతిష్ట మహోత్సవం




**అనంతగిరి, మే 14 మహా :** శివపార్వతుల దీవెనలతో నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు... అనంతగిరి మండలం మొగలాయికోట గ్రామంలో పార్వతి సమేత రామలింగేశ్వర విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ఆ పరమశివుని అనుగ్రహంతో ప్రజలు ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని అన్నారు. గ్రామాల్లో ఆలయాలు నిర్మించుకొని ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం వలన ప్రజలందరికీ మంచి జరుగుతుందని తెలిపారు . ప్రతిష్ట మహోత్సవం లో ప్రజలు తండోపతండాలుగా ఆలయాల జరిగే ఉత్సవాల్లో పాల్గొంటున్నారు. గ్రామం అంతా హర హర మహాదేవ శంభో శంకర అనే కీర్తనలతో మార్మోగి పోయాయి. ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంత లభిస్తుందని ఈ కార్యక్రమంలో మొగలాయికోట మాజీ సర్పంచ్ పొరల్ల ఉమా సత్యనారాయణ టిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కోండ్రు వెంకటరత్నం శింగారెడ్డి నారాయణరెడ్డి ఎస్ అప్పిరెడ్డి అల్లెబోయిన శివ నూకల శీను పోల్లా పూర్ణ పెళ్లికొడుకు వెంకటేశ్వర్లు తదితరులు మొగలాయికోట బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# సరస్వతి పుష్కరాలకు విస్తృత ఏర్పాట్లు

■ దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి శైలజా రామయ్యర్
■ పుష్కరాలలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి
■ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ





**కాటారం, మహా :** 15వ తేదీ నుంచి 26వ తేదీ వరకు జరిగే సరస్వతి పుష్కరాల సందర్భంగా విచ్చేయు భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ తెలిపారు. బుధవారం సరస్వతి ఘాట్ వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రేపు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సరస్వతి మాతా విగ్రహం, ఘాట్ ప్రారంభోత్సవం చేస్తారని, పుష్కర స్నానమాచరించి స్వామి వారిని దర్శించుకుంటారని, అనంతరం త్రివేణి సంగమంలో మొట్ట మొదటి సారిగా కాశీ పండితులు నిర్వహించనున్న నదీ హారతిలో పాల్గొంటారని తెలిపారు. మన రాష్ట్రంలో. మొట్ట మొదటిసారిగా పెద్ద ఎత్తున పుష్కరాలు నిర్వహిస్తున్నామని జిల్లా యంత్రాంగం భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, భక్తుల పట్ల గౌరవంగా వ్యవహరించాలని భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉందని ఆమె సూచించారు.

**పుష్కరాలలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

సరస్వతి పుష్కర విధులు కేటాయయించిన సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఈ 12 రోజులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం కాళేశ్వరం దేవస్థానం లోని కళ్యాణ మండపంలో విధులు కేటాయించిన వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి కేటాయించిన విధుల పట్ల దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన జిల్లాలో పెద్ద ఎత్తున సరస్వతి పుష్కరాలు జరుపుతున్నామని, అందుకు తగినట్లుగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రతిరోజు లక్షకిపైగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అధికార యంత్రం ఆసాంతం అప్రమత్తంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. ప్రతి అధికారికి కేటాయించిన లొకేషన్స్ లో ముందస్తుగా పర్యటించి ఏర్పాట్లు పరిశీలన చేయాలని తెలిపారు. గైర్హాజరైన అధికారులకు, సిబ్బందికి ఆయా శాఖలకు తగు చర్యలు నిమిత్తం సిఫారసు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. 15వ తేదీ ఉదయం పుష్కరాలు ప్రారంభమవుతాయని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పుష్కరాలను ప్రారంభించనున్నారని తెలిపారు. 15వ తేదీ సాయంత్రం 5 గంటలకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి సరస్వతి మాత విగ్రహం ఆవిష్కరణ, పుష్కర స్నానం తదుపరి స్వామి వారి దర్శనం, గోదావరి హారతి కార్యక్రమాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేస్తారని అనంతరం టెంట్ సిటీ పరిశీలిస్తారని తెలిపారు. కాశీ పండితులతో ప్రత్యేకంగా హారతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 12 సంవత్సరాలకు ఒకసారి జరుగుతున్న ఈ పుష్కరాలను రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నదని అన్నారు. కుంభమేళా వెళ్లలేని వారు ఇక్కడికి వచ్చే అవకాశం ఉందని ఆ ప్రకారం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ 12 రోజుల విధులు చాలా ముఖ్యమని ఎలాంటి ఇబ్బందులు రాకుండా సమన్వయంతో పని చేయాలని సూచించారు. సరస్వతి ఘాట్ మెయిన్ ఘాట్ వద్ద భక్తులు పుష్కర స్నానాలు చేసేందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు ఆయన వివరించారు. భక్తులకు స్నానాల షవర్లు, బట్టలు మార్చుకునే గదులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పిండ ప్రధాన కార్యక్రమాలు చేసేందుకు కూడా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. స్టాళ్లు, టెంట్ సిటీ, డార్మెటరీ, ఫుడ్ కోర్ట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అధికారులు తు.చ తప్పక విఐపి ప్రోటోకాల్ పాటించాలని సూచించారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నామని కంట్రోల్ రూమ్ కి వచ్చిన సమస్యను తక్షణమే ఆయా శాఖల అధికారులు దృష్టి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దేవాలయంలో భక్తులు క్యూలైన్ పాటించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. 50 మంది గజ ఈతగాళ్ళు నాటు పడవలతో పహారా కాస్తున్నట్లు తెలిపారు. విధులు నిర్వహించే అధికారులు సిబ్బందిని పర్యవేక్షణ చేస్తూ ఎలాంటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తాత్కాలిక బస్టాండ్ నుంచి ఘాట్స్ వరకు భక్తుల సౌకర్యార్థం ఉచితంగా 30 షటిల్ బస్సులు నడుపుతున్నామని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పుష్కరవిధులు కేటాయించిన అధికారులకు రెండు షిఫ్టుల్లో విధులు కేటాయించామని అప్రమత్తంగా ఉండాలని, సమయానికి విధులకు హాజరు కావాలని తెలిపారు. ఎవరైనా గైర్హాజరు అయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విధులు కేటాయించిన సిబ్బందికి భోజన, వసతి ఏర్పాటు చేస్తున్నామని సమయ పాలన పాటించాలని సూచించారు. స్విమ్మర్లు లైఫ్ బాయ్స్, జాకెట్స్ ధరించాలని గోదావరిలో ఏ ఒక్కరు మిస్ అయిన విధులకు ఇబ్బంది కలుగుతుందని అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో దేవాదాయశాఖ డైరెక్టర్ వెంకటరావు, అదనపు కలెక్టర్లు అశోక్, విజయలక్ష్మి, సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆర్డిఓ రవి అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సమ్మెను జయప్రదం చేయండి



**మిర్యాలగూడ, మే14 మహా :** కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరుతూ ఈనెల 20న చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి డాక్టర్ మల్లు గౌతమ్ రెడ్డి హమాలి వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు తిరుపతి రామ్మూర్తి కోరారు. బుధవారం రైస్ మిల్ హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె వాల్ పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాలరాసేందుకు కేంద్ర ప్రభుత్వం పాత కార్మిక చట్టాలను రద్దు చేస్తుందని విమర్శించారు. కొత్త చట్టాల ద్వారా కార్మికులకు తీరని అన్యాయం చేస్తున్నదని విమర్శించారు. కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. సంఘటిత అసంఘటిత రంగ కార్మికులు ప్రభుత్వ రంగ సంస్థల కార్మికులు ఉద్యోగులందరూ ఈ సమ్మెను జయప్రదం చేయాలని కోరారు 20న సమ్మెలో భాగంగా సుందరయ్య పార్క్ నుండి రాజీవ్ చౌక్ వరకు కార్మికుల ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు గుణగంటి రామచంద్ర హమాలీ పాల్గొన్నారు.

# కళ్యాణి లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ




**రాజేంద్రనగర్, మహా :** శంషాబాద్ రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో శంషాబాద్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ లబ్ధిదారులకు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అందించే డబ్బులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తహసిల్దార్ కె రవీందర్ దత్ మాట్లాడుతూ 53 మంది లబ్ధిదారులకు రూ . 530 6,148 / చెక్కులు అందజేయడం జరిగిందన్నారు. శంషాబాద్ మండలంలో 31 , మంది లబ్ధిదారులకు, మున్సిపాలిటీ పరిధిలో 22 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలోనయాబ్ తహసిల్దార్ వేణు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు కృష్ణ, సారిక, చిన్న గోల్కొండ సొసైటీ చైర్మన్ బొమ్మ దావనాకర్ గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ సుష్మా రెడ్డి, నీరటి రాజు ముదిరాజ్, మార్కెట్ సొసైటీ డైరెక్టర్ అనేగౌని శ్రీకాంత్ గౌడ్, కిట్టు, సత్యానంద్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదం వ్యక్తి మృతి



**రాజేంద్రనగర్, మహా :** రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన శంషాబాద్ ఆర్జీఐ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. స్టేషన్ హౌస్ ఆఫీసర్ కే బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ జిల్లా గుండ్ల పోచంపల్లి గ్రామానికి చెందిన కల్వ అంజయ్య (40) గత 15 సంవత్సరాలుగా రిలయన్స్ వెజిటేబుల్ మార్కెట్ లోని కండ్లకోయలో సూపర్వైజర్ గా పని చేస్తున్నారు. 15 రోజుల క్రితం ఇతను మామిడిపల్లిలోని రిలయన్స్ స్టోర్ కు బదిలీపై వచ్చారు. మంగళవారం 13వ తేదీ కండ్ల కోయ నుంచి డీసీఎం వ్యాన్ లో కూరగాయలు తీసుకొని శంషాబాద్ వైపు వస్తున్నారు. డీసీఎం ను నడుపుతున్న నిజామాబాదుకు చెందిన అలకుంట రాజు ఔటర్ రింగ్ రోడ్డుపై ఏడున్నర గంటల సమయంలో ముందుగా వెళుతున్న మరో డిసిఎం ను ఢీ కొట్టాడు. దీంతో డ్రైవర్ ఎడమ పక్కన కూర్చున్న అంజయ్య డీసీఎం లో ఇరుక్కుపోయి మరణించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని శవాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణానికి 11.0 లక్షలు విరాళం



**షాద్ నగర్, మహా :** షాద్ నగర్ పట్టణంలో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణానికి కొత్తూరు మండలంలోని తీగాపూర్ గ్రామంలో ఉన్న బింజుసారియా ఇస్పత్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ యాజమాని వినోద్ కుమార్ కేడియా. తన తండ్రిగారైన భన్వరీ లాల్ జి జ్ఞాపకార్థం 11.0 లక్షల రూపాయల విరాళాన్ని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కి అందించారు. ఈ సందర్భంగా కంపెనీ యాజమాని వినోద్ కుమార్ కేడియా మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలలో చదివే పేద పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలనే ఉద్దేశ్యంతో కళాశాల నిర్మించడం గొప్ప విషయం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మోముల బసప్ప, హితేష్ కేడియా తదితరులు పాల్గొన్నారు.

# స్వయం ఉపాధితో మహిళల ఆర్థిక బలోపేతం

ఎలక్ట్రికల్ ఆటో డ్రైవింగ్ శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్, మహా:** ప్రభుత్వం అందజేస్తున్న శిక్షణలు, పథకాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. తిమ్మాపూర్ ఎల్ఎండి కాలనీలోని దుర్గాబాయి దేశ్ముఖ్ మహిళా శిశు వికాస కేంద్రంలో 20 మంది మహిళలకు ఎలక్ట్రికల్ ఆటో డ్రైవింగ్ లో గత నెల 12 నుండి ఇస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ బుధవారం పరిశీలించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా సాధికారథ లక్ష్యంగా, వారు ఆర్థికంగా బలోపేతం కావాలన్న ఉద్దేశంతో విభిన్నంగా ఎలక్ట్రికల్ ఆటో డ్రైవింగ్ లో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఈ ఆటోలను పైసా ఖర్చు లేకుండా నడుపుకోవచ్చని, తద్వారా రోజు వారి ఆదాయం సంపాదించవచ్చని అన్నారు. ఇదివరకే కరీంనగర్లో ఎన్నో సంవత్సరాలుగా ఆటో డ్రైవింగ్ వృత్తిలో రాణిస్తున్న పలువురు మహిళా ఆటో డ్రైవర్లు ప్రజల నుండి ప్రశంసలు అందుకుంటున్నారని తెలిపారు. శిక్షణ విజయవంతంగా పూర్తి అయిన తర్వాత మహిళలు ఆటోలు కొనుగోలు చేసేందుకు రుణ సదుపాయం కల్పించే ఏర్పాట్లు చేస్తామని అన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని బృందాలకు ఎలక్ట్రికల్ ఆటో రంగంలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆటో డ్రైవర్ గా మహిళలు రాణిస్తూ తోటి మహిళలకు ఆదర్శంగా నిలవాలని, డ్రైవింగ్ రంగంలోకి మరింత మంది మహిళలను ఆకర్షించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవింగ్ రంగంలో రాణిస్తున్న మహిళలు వారి అభిప్రాయాలను వెల్లడించారు.

అనంతరం శిక్షణ పొందిన మహిళ డ్రైవర్లు ఆటో నడుపుతుండగా జిల్లా కలెక్టర్ ప్రయాణించారు. మహిళా ఆటో డ్రైవర్ల శిక్షణకు సహకరించిన బజాజ్ బృందాన్ని కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్ సుధారాణి, రాజ కిషన్ రెడ్డి, బజాజ్ కంపెనీ మేనేజర్లు అనిల్ కుమార్, నాగరాజు పాల్గొన్నారు.



# నేటి నుండి సరస్వతి పుష్కరాలు ప్రారంభం

**కాటారం, మహా :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కాళేశ్వరం లో పన్నెండేళ్ల కు ఒక నదికి జరిగే పుష్కర సంరంభం సరస్వతి పుష్కరాలు బుధవారం ప్రారంభమవుతున్నాయి. పీఠాధిపతుల పుణ్య స్నానాలు చేయడంతో పుష్కరాలు ప్రారంభమవుతాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు తో కలిసి పుష్కర ఘాట్లో సరస్వతి విగ్రహాన్ని, హారతుల వేదికలను ప్రారంభిస్తారు. పుష్కర స్నానం కోసం వచ్చే భక్తులకు అన్ని రకాల ఏర్పాట్లను ప్రభుత్వం చేపట్టింది. గోదావరి నదిలో బయట చలువ పందిళ్లు, మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్లు నిర్మాణం, హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, గోదావరిఖని ఇతర దూర ప్రాంతాల నుండి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులను నడిపిస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పోలీస్ శాఖ పూర్తిస్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణంలో 12 రోజులపాటు యాగాలు నిర్వహిస్తున్నారు. భక్తులు కోసం 40 టెంట్ సిటీ లను, 100 పడకల డార్మేటరీని ఏర్పాటు చేశారు. త్రివేణి సంగమములో భక్తులు బోట్లో ఆహ్లాదకరంగా రైడ్ చేయొచ్చు. హెలికాప్టర్ ద్వారా ఏడు నిమిషాల జాయిరాయిడ్ సౌకర్యం కల్పించారు. వీఐపీల రాక కోసం రెండు హెలిప్యాడ్ లను నిర్మించారు. వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్, శ్రీ వాసవి ఆర్యవైశ్య నిత్యాన్న సత్రం ద్వారా మహా అన్నదానం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

**సరస్వతీనది పుష్కరదీప్తి**

నదీస్నానాలు, కోనేటి స్నానాలు, సముద్ర స్నానాలు, మంగళ స్నానాలు హిందువుల సాంప్రదాయం. అలాగే తీర్థయాత్రలు , పుణ్యక్షేత్రాల దర్శనం కూడా నీటితో ముడిపడి ఉంది. నదీ స్నానాలలో పుష్కర స్నానం పుణ్యప్రదమని పురాణ వచనం. ఇలా జీవరాశులకు ప్రధానమైన జలం ప్రాముఖ్యతను గుర్తు చేసేవే పుష్కరాలు. మానవాళికి మహోపకారిగా, మోక్ష ప్రదాయినిగా నిలుస్తున్న పవిత్ర సరస్వతీనది పుష్కరశోభను సంతరించుకుంటోంది. బృహస్పతి మిధున రాశిలో ప్రవేశంతో అంతర్వాహిని అయిన సరస్వతీనది పుష్కరాలు ఆరంభం కానున్నాయి. 15052025 నుండి 26052025 వరకు 12 రోజులపాటు సరస్వతీనది పుష్కర వైభవం జగజ్జేయమానంగా వెలుగొందనుంది. పుష్కరవేళ ఆయా ప్రాంత క్షేత్రాలకు వెళ్ళి పవిత్రస్నానాలు ఆచరించి, పితృకర్మలు గావించి పునీతులు కావాలన్న సంకల్పంతో లక్షలాది మంది భక్తులు సిద్ధం అవుతున్నారు.

**పుష్కరాలు జరిగే ప్రదేశాలు**

సరస్వతీనది ఉత్తరాఖండ్ రాష్ట్రం బద్రీనాథ్ దగ్గరలోని "మన" అనే గ్రామంలో పుట్టింది. అయితే ఈ నది అంతర్వాహిని. అందువల్ల సరస్వతి నదీ పుష్కరాలు "మన" లో జరుగుతాయి. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ప్రయాగ్ రాజ్ లోని త్రివేణి సంగమంలోను, రాజస్థాన్ రాష్ట్రంలోని పుష్కర్ లోను, గుజరాత్ రాష్ట్రంలోని సోమనాథ్ త్రివేణి సంగమంలోను జరుగుతాయి. మన తెలంగాణా రాష్ట్రంలోని కాళేశ్వరంలోని త్రివేణీ సంగమంలోను సరస్వతీనదీ పుష్కరాలు జరుగుతాయి.

# కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే రైతులు సుభిక్షం

■ రైతు భరోసా.. రైతు ప్రీమియం చెల్లించని కాంగ్రెస్
■ స్థానిక సంస్థల్లో తగిన బుద్ధి చెప్పాలి
■ మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా :** ఎక్కువాయిపల్లి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, గువ్వల బాలరాజ్ డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా పరిశీలించారు. తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ నాయకత్వంలో పదేండ్ల ప్రభుత్వంలో రైతులు సుభిక్షంగా, రాజుగా బతికాడని అన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చే అన్ని రకాల సబ్సిడీలకు ఎగనామం పెడుతున్నారని, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఆరోపించారు. బుధవారం కడ్తాల్ మండలం లోని కడ్తాల సింగల్ విండో సబ్ సెంటర్ ఆధ్వర్యంలో ఎక్కువాయిపల్లి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజ్, సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తాతో కలిసి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తొలి నాళ్లలో కెసిఆర్ ప్రభుత్వం అన్ని వర్గాలను సంతృప్తి పరుస్తూ పరిపాలన కొనసాగించిందని, ఈ ప్రభుత్వం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలకు మంగళం పాడే దిశగా వ్యవహరిస్తుందని అన్నారు. కెసిఆర్ మూడు పంటలకు రైతు భరోసా అందిస్తూ రైతులను ఆర్థికంగా ఆదుకోవడం జరిగిందని జయపాల్ యాదవ్ గుర్తు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా కింద రూ. 22 వేల కోట్లు రైతులకు అందించాల్సి ఉండగా, కేవలం మూడు నాలుగు ఎకరాలతో సరిపెట్టుకొని రూ. 5 వేల కోట్లు మాత్రమే విడుదల చేయడం జరిగిందని గుర్తు చేశారు. కరెంటు ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని అయోమయ పరిస్థితి నెలకొందని ఆరోపించారు. అదేవిధంగా రైతన్నల కోసం గత ప్రభుత్వం రైతు భీమా ప్రవేశపెట్టడం జరిగిందని, ఎవరైనా రైతు మృతి చెందితే అతని కుటుంబ సభ్యులకు ఐదు లక్షల రైతు బీమా అందివ్వడం జరిగిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు రైతు భీమాకు సంబంధించిన ప్రీమియం కట్టలేదని ఆయన దుయ్యబట్టారు. ప్రపంచ దేశాలు తెలంగాణ రైతులను గుర్తించే విధంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పరిపాలన కొనసాగించారని ఆయన అన్నారు. ఇటీవల కురిసిన అకాల వడగండ్ల వానకు పంట నష్టపోయిన రైతన్నలను ఆదుకోవాలని కోరారు. కడ్తాల్ మండలంలోని ఎక్కువాయిపల్లి గ్రామంలో 5000 ఎకరాల పంట నష్టం జరిగిందని వెంటనే ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పంట నష్టాన్ని అంచనా వేసి ఎకరాకు రూ. 30 వేల ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని జయపాల్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు జోగు వీరయ్య మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్, మాజీ సర్పంచ్ లాల్కోట నరసింహ భరతమ్మ, మాజీ వార్డ్ మెంబర్ బిక్షపతి, నాయకులు బాలయ్య, యాదయ్య, మహేష్, వీరేష్, వంశీ యాదవ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# జానపద గాయని అరుణకు పురస్కారం

■ జానపదాలు జనజీవన రంజకాలు
■ ప్రజాకళా వేదిక అధ్యక్షుడు అరవ జయపాల్




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఎక్వాయిపల్లికి చెందిన ఫోక్ సింగర్ బద్రుపల్లి అరుణకు జానపద పురస్కారం లభించింది. తిరుపతి శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ విశ్వవిద్యాలయంలో జరిగిన ప్రజా కళావేదిక మరియు డైరెక్టర్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్ మరియు కల్చర్ అఫైర్స్ వారి ఆధ్వర్యంలో జరిగిన మన పల్లె జానపదం జాతర కార్యక్రమంలో కడ్తాల్ మండలం, ఎక్వాయిపల్లి గ్రామానికి చెందిన ఫోక్ సింగర్ బద్రుపల్లి అరుణకు జానపద పురస్కారం లభించింది. షీల్డ్, ప్రశంసాపత్రం అందించి, సన్మానం చేయడం జరిగింది. రెండు తెలుగు రాష్ట్రాల నుండి హాజరైన 300 మంది జానపద కళాకారుల పాటకు పట్టాభిషేకం చేసి సన్మానించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా డాక్టర్ మురళీధర్ హరి సర్వోత్తమ నాయుడు, ప్రముఖ కవి ప్రిన్సిపాల్ డాక్టర్ సి నారాయణస్వామి, సినీ గీతా రచయిత కవి సురేంద్ర పాల్గొన్నారు. ప్రజాకళా వేదిక అధ్యక్షుడు అరవ జయపాల్ మాట్లాడుతూ... జానపదాలు జనజీవన రంజకాలు జగతికి జీవనాడులు అని తెలిపారు. ఈ సందర్భంగా ఎక్కువాయిపల్లికి చెందిన అరుణకు పురస్కారం లభించడం పట్ల మఠంపల్లి గ్రామ ప్రజలు, బంధుమిత్రులు అభినందనలు తెలిపారు






## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంఘీభావ ర్యాలీ

**ఆదిలాబాద్ మహా:** పహల్ గామ్ బాధిత కుటుంబాలకు,భారత సైనికులకు, అమరులైన వీర జవాన్ లకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. బుధవారం జైనథ్ మండలం నిరాల గ్రామంలోని త్రినేత్ర గార్డెన్ లో జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశం అనంతరం గ్రామంలో ఈ ర్యాలీ నిర్వహించారు. టీపీసీసీ ఉపాధ్యక్షులు ఉర్దూ అకాడమీ చైర్మన్ పరిశీకులు తాహెర్ బిన్ హందన్ , టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పరిశీలకులు చిట్ల సత్యనారాయణ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ పహల్గామ్ ఉగ్రదాడిని ఖండించారు. పహల్గామ్ దాడిలో అమరులైన టూరిస్టులకు నివాళ్లు అర్పించి బాధిత కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. ఆపరేషన్ సింధూర్ లో పోరాడిన వీర జవాన్ ల తెగువను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యులు నరేష్ జాదవ్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజా రెడ్డి,జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ బేలా మండల అధ్యక్షులు ఫైజల్లా ఖాన్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు, లోక ప్రవీణ్ రెడ్డి, ఎం.ఏ షకీల్,మాజీ జడ్పీటీసీ రాందాస్ నాక్లే,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వామన్ వాంఖడే,నాయకులు అడ్డి రూకేష్ రెడ్డి, పంద్రే దిలీప్,వెంకన్న యాదవ్,కామ్రే మనోజ్,నర్ర విట్టల్ యాదవ్,దీపక్ రావు,నిమ్మల ప్రభాకర్, ప్రకాష్ రెడ్డి,మడవి చంద్రకాంత్,రాందాస్,రాజ్ మొహమ్మద్,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని,బూర్ల శంకరయ్య,పత్తి ముజ్జు,దాసరి ఆశన్న,మాధవ్,సంజీవ్ రెడ్డి పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేయాలి

- కాంగ్రెస్ శ్రేణులకు పరిశీలకుల పిలుపు
- నిరాలలో జైనథ్, బేల, భోరజ్ మండలాల సమావేశం
- ముఖ్యఅతిథులుగా హాజరైన తాహెర్ బిన్ హందన్, చిట్ల సత్యానారాయణ
- అసెంబ్లీ ఇంచార్జీ కంది శ్రీనివాస రెడ్డి అధ్యక్షతన కార్యక్రమం





**ఆదిలాబాద్ మహా :** పార్టీ కోసం కష్ట పడేవారికి పదవులు వెతుక్కుంటూ వస్తాయని ,జెండా మోసిన కార్యకర్తలను పార్టీ గుర్తిస్తుందని టీపీసీసీ ఉపాధ్యక్షులు పరిశీలకులు , ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందన్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం నిరాల గ్రామంలోని త్రినేత్ర గార్డెన్ లో బేల , జైనథ్ ,భోరజ్ మండలాల కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఆదిలాబాద్ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మరో పరిశీలకులు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిట్ల సత్యనారాయణ తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ ఎంతో చరిత్ర కలిగిన పార్టీ అని తాహెర్ బిన్ హందన్ తెలిపారు. ఈ మూడు మండలాలలో కాంగ్రెస్ పార్టీకి పునర్ వైభవం తీసుకురావాలనే ఉద్దేశంతో సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పార్టీలో ఉంటూ పార్టీ కోసం కష్టపడే నాయకులు పదవులకు అర్హులన్నారు. అలాంటి వారు అధ్యక్షపదవులను ఆశించవచ్చన్నారు. నాయకులు కార్యకర్తలు పదవులు కోసం కాకుండా పనిలో పోటీ పడాలని పార్టీకోసం పని చేయాలని అప్పుడు మంచి కార్యకర్తగా గుర్తింపు వస్తుందన్నారు.పార్టీ ఆదేశాను సారం పని చేయాలని పార్టీ సిద్ధాంతాలకు భిన్నంగా కార్యకర్తల ప్రవర్తన ఉండకూడదన్నారు.అనంతరం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పరిశీలకులు చిట్ల సత్యనారాయణ మాట్లాడుతూ పార్టీ ప్రక్షాళన కోసమే ఈ విస్తృతస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పెద్దల ఆదేశానుసారం జిల్లాలో పార్టీని తిరిగి పటిష్ట స్థితికి చేర్చేందుకు ఈ కార్యక్రమానికి వచ్చినట్టు ఆయన తెలిపారు.జిల్లా , నియోజకవర్గ స్థాయి సమావేశాలు పూర్తి చేసుకున్నామని మండల సమావేశాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ సీట్లు సాధించడమే లక్ష్యంగా ప్రతి నాయకుడు కార్యకర్త పని చేయాలని పిలుపునిచ్చారు .గాంధీ భవన్ లో జరిగిన మీటింగ్ లో అధిష్టానం సూచనల ప్రకారం పార్టీ పునర్ వైభవం కోసం పార్టీ ప్రక్షాళన చేపడుతుందన్నారు. బూత్ స్థాయి నుండి పార్టీ బలోపేతం కావాలంటే ముందుగా అధ్యక్షపదవుల ఎంపిక చేయాల్సి ఉందన్నారు. అందుకే అర్హుల నుండి దరఖాస్తులు కోరిన్నట్టు తెలిపారు. పార్టీ కష్టపడి పని చేసే వారిని వదులుకోదని అలాంటి నాయకులుగా ప్రతి ఒక్కరు ఎదగాలన్నారు. కన్నతల్లి లాంటి కాంగ్రెస్ పార్టీని కాపాడుకుంటూ పార్టీ పటిష్టతకు కలిసికట్టుగా పని చేయాలని సూచించారు.అనంతరం సభకు అధ్యక్షత వహించిన అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం పాటుపడే పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. అంతా కలిసి కట్టుగా పార్టీ బలోపేతం కోసం పని చేస్తామన్నారు.తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో ప్రజల్లోకి తీసుకుపోతున్నామన్నారు.మండల గ్రామ బూత్ స్థాయిలో నాయకులు కార్యకర్తలను కలుపుకొని పార్టీని బలోపేతం చేస్తామన్నారు. వచ్చే ఎన్నికలేవైనా కాంగ్రెస్ పార్టీ విజయ ఢంకా మోగించేలా అంతా కలిసి కష్ట పడుదామని ఆయన శ్రేణులకు పిలుపునిచ్చారు. పదవులు ఎవరికి వచ్చినా అందరి లక్ష్యం పార్టీ పటిష్టతే కావాలని అందుకోసం అందరం ఏకతాటి పైకి వచ్చి కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కష్టపడుదామన్నారు. ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేనంతగా పార్టీని బలోపేతం చేసేందుకు తన శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. తన ప్రసంగంలో కేంద్ర ప్రభుత్వం విమర్శలు గుప్పించారు. ఈ విస్తృతస్థాయి సమావేశంలో ఏఐసీసీ సభ్యులు నరేష్ జాదవ్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజా రెడ్డి,జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ బేలా మండల అధ్యక్షులు ఫైజల్లా ఖాన్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు,లోక ప్రవీణ్ రెడ్డి, ఎం.ఏ షకీల్,మాజీ జడ్పీటీసీ రాందాస్ నాక్లే,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వామన్ వాంఖడే, నాయకులు అడ్డి రూకేష్ రెడ్డి,పంద్రే దిలీప్,వెంకన్న యాదవ్,కామ్రే మనోజ్,నర్ర విట్టల్ యాదవ్,దీపక్ రావు,నిమ్మల ప్రభాకర్,ప్రకాష్ రెడ్డి ,మడవి చంద్రకాంత్,రాందాస్,రాజ్ మొహమ్మద్,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని,బూర్ల శంకరయ్య,పత్తి ముజ్జు,దాసరి ఆశన్న,మాధవ్,సంజీవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మణికొండ మున్సిపాలిటీలో పార్కు స్థలం కబ్జా

- హైడ్రాలో డాలర్ హిల్స్ కాలనీ వాసుల ఫిర్యాదు
- పార్క్ స్థలాన్ని పరిశీలించిన కమిషనర్ రంగనాథ్



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా :** మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని డాలర్ హిల్స్ కాలనీలో స్థానికుల ఫిర్యాధు మేరకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ పర్యటించి ప్రాంతాన్ని పరిశీలించారు. కాలనీ పార్కు స్థలంలో నిర్మాణాలు జరుగుతున్నాయని, డాలర్ హిల్స్ కాలనీవాసులు హైడ్రా కార్యాలయంలో ఫిర్యాదు చేయడంతో బుధవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ కబ్జా అయిన పార్క్ స్థలం ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం నిర్మాణ దారులను కమిషనర్ రంగనాథ్ ప్రశ్నించగా, పార్కు స్థలం తాము కబ్జా చేయలేదని, డబ్బులు పెట్టి ల్యాండ్ కొనుగోలు చేసి, ప్రభుత్వ అనుమతులు పొంది నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. హైడ్రా కమీషనర్ రంగనాథ్ మాట్లాడుతూ... డాక్యుమెంట్లను పరిశీలించి, సమావేశం ఏర్పాటు చేసి, అనంతరం సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

## టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, జిల్లా అధ్యక్షుడి నియామకం



**వరంగల్, మహా;** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ చేనేత విభాగం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా 12వ డివిజన్ కు చెందిన కాంగ్రెస్ నాయకులు బాసాని కరుణాకర్ ను, వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా 13వ డివిజన్ వీవర్స్ కాలనీకి చెందిన దాసరి రాజశేఖర్ ను మంత్రి కొండా సురేఖ ఆదేశానుసారం రాష్ట్ర అధ్యక్షులు గూడూరి శ్రీనివాస్ బుధవారం నియమించారు. చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా వారికి నియామక పత్రాలు అందజేశారు. తమపై నమ్మకంతో ఈ పదవిని ఇచ్చిన గూడూరు శ్రీనివాస్ కు, ఈ పదవి రావడానికి సహకరించిన చిప్ప వెంకటేశ్వర్లుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీ నమ్మకాన్ని వమ్ము కానీయకుండా చేనేత కార్మికులకు ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలు సక్రమంగా అందేలా చూస్తూ వారికి అండదండలు అందిస్తామని హామీనిచ్చారు.

## ఝాన్సీ కంటోన్మెంట్ ఆర్మీ జాయింట్ కమాండ్ ఆఫీసర్ గా ప్రమోట్ అయిన మెటుపల్లి వాసి

**మెటుపల్లి, మహా :** మెటుపల్లి పట్టణానికి చెందిన ఆకుల లక్ష్మీనర్సయ్య దంపతుల పెద్ద కుమారుడు అయిన ఆకుల ఆనంద్ 2005 వ సంవత్సరంలో ఆర్మీలో చేరి గత 20 సంవత్సరాలలో అంబలా, ఢిల్లీ,జమ్మూకాశ్మీర్, ఝాన్సీ, హర్యానా, చండీగఢ్, లేహ్, లద్ధాక్, ఝాన్సీలో వివిధ హోదాలలో పనిచేసి ఝాన్సీ బుధవారం ,ఆర్మీ కంటోన్మెంట్ జూనియర్ కమాండ్ ఆఫీసర్గా పదోన్నతి పొందారు.ఈ సందర్భంగా వారి తల్లిదండ్రులు కుటుంబసభ్యులు ఎంతో సంతోషపడ్డారు.అంతేగాక మన ప్రాంత వాసి ఆర్మీలో ఉన్నత స్థానం పొందటం పట్ల పలువురు ఆనందం వ్యక్తం చేశారు. ఒక సామాన్య రైతు కుటుంబానికి చెందిన వ్యక్తి కష్టపడి ఈ స్థాయికి రావడం ఎంతో గొప్ప విషయమని ఇలాంటి వారిని చూసి స్థానిక యువకులు ఆదర్శంగా తీసుకుని దేశసేవకు ముందుకు రావాలని పలువురు పిలుపునిచ్చారు.ఇక వీరి కుటుంబ విషయానికి వస్తే తల్లిదండ్రులు ఆకుల లక్ష్మీనర్సయ్య మామూలు రైతులు నిరాక్షరాస్యులు వీరి కూతురు ఆకుల మంజుల గవర్నమెంట్ టీచర్ గా, పెద్ద కుమారుడు ఆనంద్ ఆర్మీ ఆఫీసర్,చిన్న కుమారుడు ఆకుల ప్రవీణ్ అడ్వకేట్ పనిచేస్తున్నారు.కష్టపడి పిల్లలను ఈ స్థాయికి తీసుకువచ్చిన వారి తల్లిదండ్రులను పలువురు అభినందించారు.

## కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన డిసిసిబి చైర్మన్



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** డిసిసిబి చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య ఆకస్మిక తనిఖీ చేసి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఉన్న సమస్యల పరిష్కారానికి రైతులకు హామీ ఇచ్చారు.బుధవారం ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని తోరూర్, గోరెల్లి, బండరావిరాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను, తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ బ్యాంక్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కేంద్రాలలో ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఏర్పడిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలంటూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, ధాన్యం కొనుగోలు పై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, రైతులకు ప్రోత్సాహకంగా రూ.500 బోనస్ ఇస్తున్నట్లు తెలిపారు. రైతులు తెచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందని, రైతులు ఎవరు కూడా అపోహలకు వెళ్ళవద్దని, తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలో విక్రయించి లాభాన్ని పొందాలని ఆయన తెలిపారు. అనంతరం రైతులతో సమావేశమై, రైస్ మిల్లర్ల యాజమాన్యంతో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా దాన్ని కొనుగోలు నిర్వాహకులు, రైతులు పలువురు పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్న వారికి అండగా సనాతన హిందూ సేవా సమితి

**వరంగల్, మహా;** మన సనాతన హిందూ సేవా సమితి నుండి 63 వ సేవా కార్యక్రమంలో భాగంగా చిన్న వయసులోనే భర్తను కోల్పోయి పిల్లల పోషణ తో పాటు చదువులకు ఇబ్బంది గా మారి ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న హన్మకొండ హంటర్ రోడ్ లోని విద్యుత్ నగర్ కు చెందిన చేలిక సునీతకు మన గ్రూప్ సనాతన హిందూ సేవా సమితి నుండి రెండు నెలలకు సరిపడా బియ్యంతో పాటు నిత్యావసర సరుకులను అందించారు. ఈ సందర్భంగా సునీత గ్రూప్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మన గ్రూప్ వ్యవస్థాపకుడు తాళ్లపల్లి నగేష్, అధ్యక్షుడు మిట్టపెల్లి వేణు, గ్రూప్ సభ్యులు నోముల మహేష్ బాబు, పడకంటి రామ్ చందర్,మాలోత్ రవి, సత్తు శ్రీకాంత్, గందమళ్ళ సాయి కుమార్,బడుగు రాము, వైట్ల నాగరాజు, మేకల శశికాంత్, తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల శ్రమను దోచుకుంటున్న యాజమాన్యాలు

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్
- మే 20న జరిగే సమ్మెను విజయవంతం చేయాలి
- వైట్ గోల్డ్ కంపెనీలలోని కార్మికులకు పిలుపు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఇబ్రహీంపట్నం పారిశ్రామిక ప్రాంతంలో మెహక్ ఇంటర్నేషనల్ కంపెనీ వైట్ గోల్డ్ కార్మికులతో, సిఐటియు నాయకులు సమావేశం నిర్వహించడం జరిగింది. ఇబ్రహీంపట్నం మున్సిపల్ కన్వీనర్ చింతపట్ల ఎల్లేశ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి, ముఖ్యఅతిథిగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ హాజరై మాట్లాడుతూ... కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 44 కార్మిక చట్టాలు రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్ లను తీసుకు వచ్చారని, కార్పొరేట్ సంస్థలకు అనుగుణంగా చట్టాలను తీసుకురావడం జరుగుతుందని అన్నారు. 135 సంవత్సరాల క్రితం పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని సమయాన్ని, 12 గంటలకు పెంచడం వలస కార్మికుల శ్రమను, కంపెనీ యాజమాన్యాలు దోచుకుంటున్నారని, కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా 20న జరిగే దేశవ్యాప్త సమ్మెలో వివిధ శాఖలలో పనిచేసే కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో సంపద సూచించేది కార్మికులేనని అన్నారు. దేశవ్యాప్తంగా అన్ని కేంద్ర కార్మిక సంఘాలు, బ్యాంకు ఫెడరేషన్లు అందరూ ఏకమై దేశవ్యాప్త సమ్మెను చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డి జగదీష్, జిల్లా సహాయ కార్యదర్శి స్వప్న, మంచాల మండల కన్వీనర్ పోచమోని కృష్ణ, కెవిపిఎస్ నాయకులు ఎర్పుల వీరేషం, కంపెనీ కార్మికులు, శాంతమ్మ, పద్మ, బాలమణి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## మహోనియా హాస్పిటల్ ప్రారంభించిన ఎమ్మెల్యే రంగారెడ్డి




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** మన్నెగూడలోని మహోనియా హాస్పిటల్ ను ఎమ్మెల్యే రంగారెడ్డి ప్రారంభించారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని మన్నెగూడ సాగర్ రహదారిపై నూతనంగా ఏర్పాటుచేసిన హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి హాజరై, హాస్పిటల్ ఎండి డాక్టర్ సువర్ణ, డాక్టర్ భాస్కర్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆరుట్ల మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, సామా భీమ్ రెడ్డి, రాచర్ల వెంకటేష్, ముత్యాల రాజశేఖర్ రావు, కోడూరి రమేష్, శ్రీనివాస్ నాయక్, ప్రజా ప్రతినిధులు, స్థానిక మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, హాస్పిటల్ ప్రారంభోత్సవంలో పాల్గొని యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు ఉండేలా నూతన హాస్పిటల్ ఏర్పాటు కావడం హర్షణీయమన్నారు. ప్రత్యేకంగా తుర్కయంజాల్ మున్సిపాలిటీ ప్రాంత ప్రజలకు అత్యవసర సమయంలో త్వరితగతిన వైద్యం అందేలా మహోనియా హాస్పటల్ ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానిక యువతికి ఉద్యోగావకాశాలు కల్పిస్తూ, సేవా దృక్పథంతో పనిచేయాలన్నారు. మహోనియా హాస్పటల్ మేనేజ్మెంట్ డైరెక్టర్లు డాక్టర్ సువర్ణ, డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ... హాస్పిటల్లో 24 గంటలు అత్యవసర సేవలు, జనరల్ మెడిసిన్, ఆర్థో, గైనకాలజీ, పీడియాట్రిక్స్ వంటి విభాగాల్లో సేవలు అందించనున్నట్లు తెలిపారు. అధునాతన టెక్నాలజీ, అనుభవజ్ఞులైన వైద్యుల సహకారంతో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు తాము సిద్ధమని పేర్కొన్నారు. సామాన్య ప్రజలకు అందుబాటులో ఉంటూ, విశ్వసనీయ సేవలతో మహోనియా హాస్పటల్ ప్రజలలో విశ్వాసం పొందేలా పనిచేస్తుందని తెలిపారు. ప్రజల సహకారంతో ఈ ఆసుపత్రిని ఈ ప్రాంతంలో ప్రముఖ వైద్య సంస్థగా తీర్చిదిద్దాలని సంకల్పించామని హాస్పటల్ నిర్వాహకులు తెలిపారు.

## సీఎం కాళేశ్వరం పర్యటనకు అన్ని ఏర్పాట్లు

**కాటారం, మహా :** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి గురువారం కాళేశ్వరం పర్యటనకు రానున్న సందర్భంగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ఎస్పీ శ కిరణ్ ఖరే, ముఖ్యమంత్రి భద్రతా అధికారి వాసుదేవరెడ్డి తెలిపారు. బుధవారం కాళేశ్వరంలో ఈఓ కార్యాలయంలో ముఖ్యమంత్రి పర్యటనపై అధికారులతో భద్రతా ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రజలెవ్వరూ అసౌకర్యానికి గురికాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. హెలికాప్టర్ ద్వారా గురువారం సాయంత్రం 5 గంటలకు కాళేశ్వరం చేరుకుంటారని ముఖ్యమంత్రి రవాణా చేయు మార్గంలో పోలీస్ బందోబస్తు, బాంబ్ స్క్వాడ్, ట్రాఫిక్ కంట్రోల్, ఆయా విభాగాల సమన్వయంతో భద్రతా చర్యలుపర్యవేక్షణ చేయాలని తెలిపారు. మార్గంలో బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డిఆర్ఎఫ్, సింగరేణి రెస్క్యూ బృందాల సేవలు వినియోగించ నున్నట్లు తెలిపారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, ప్రత్యామ్నయంగా జనరేటర్ సిద్ధంగా ఉంచాలని విద్యుత్ అధికారులకు సూచించారు. బందోబస్తు ప్రతి ఒక్కరి బాధ్యతని స్పష్టం చేశారు. అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డిఓ రవి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అశ్వారావుపేటలో చిరుత కలకలం.. అవాస్తవమని అటవీ శాఖ స్పష్టం




**అశ్వారావుపేట, మే 14, మహా :** అశ్వారావుపేట మండలంలో చిరుత సంచారం హడావుడి సృష్టించింది. బుధవారం ఉదయం పేట మాలపల్లి సమీపంలోని ఓ కొబ్బరి తోటలో చిరుత కనిపించిందనే వార్త వైరల్ కావడంతో గ్రామస్థులు భయభ్రాంతులకు గురయ్యారు. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు ఫారెస్ట్ రేంజర్ మురళి ఆధ్వర్యంలో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలన చేపట్టారు. చిరుత సంచరించినట్టు చెప్పిన ప్రాంతంలో జాగ్రత్తగా గాలించారు. కానీ ఎక్కడా పాదముద్రలు, ఇతర ఆనవాళ్లు కనిపించలేదు. పరిశీలన అనంతరం, చిరుత సంచారం అనేది పూర్తిగా అవాస్తవం. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదు అని అటవీ శాఖ అధికారిక ప్రకటనలో స్పష్టం చేసింది. పొలంలో కనిపించినది చిరుత కాదని, హైనా అయ్యి ఉండవచ్చని స్థానికులు అనుమానించారు.

**అటవీ శాఖ విజ్ఞప్తి:**
ప్రజలు అనవసర భయాలకు లోనుకాకుండా అప్రమత్తంగా ఉండాలి. అనుమానాస్పద జంతువులు కనిపిస్తే వెంటనే అటవీ శాఖకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# లాభాల్లోనూ హీరో

## క్యూ4లో రూ.1,169 కోట్లు షేరుకి రూ.65 డివిడెండ్




ద్విచక్ర వాహన రంగ దిగ్గజం హీరో మోటోకార్ప్ గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 24 శాతం జంప్‌చేసి రూ. 1,169 కోట్లను తాకింది. వ్యయ నియంత్రణ, విభిన్న ప్రొడక్టులు, మెరుగుపడిన మార్జిన్లు ప్రభావం చూపాయి. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో రూ. 943 కోట్లు మాత్రమే ఆర్జించింది. కంపెనీ బోర్డు వాటాదారులకు రూ. 2 ముఖ విలువగల ఒక్కో షేరుకి రూ. 65 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. మొత్తం ఆదాయం రూ. 9,794 కోట్ల నుంచి రూ. 10,244 కోట్లకు బలపడింది. అయితే మోటార్‌సైకిళ్లు, స్కూటర్ల మొత్తం విక్రయాలు 13.92 లక్షల నుంచి 13.81 లక్షల యూనిట్లకు స్వల్పంగా తగ్గాయి.

## వాహన అమ్మకాలు అప్

**మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి హీరో మోటో నికర లాభం 17 శాతం ఎగసి రూ. 4,376 కోట్లకు చేరింది. 2023–24లో రూ. 3,742 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 38,643 కోట్ల నుంచి రూ. 41,967 కోట్లకు ఎగసింది. ఈ కాలంలో 5 శాతం అధికంగా 58.99 లక్షల వాహనాలు విక్రయించింది. 2023–24లో 56.21 లక్షల వాహన అమ్మకాలు నమోదయ్యాయి. గతేడాది కంపెనీ చరిత్రలోనే అత్యధిక ఆదాయం, నికర లాభాలు ఆర్జించినట్లు హీరో మోటో ఈడీ, తాత్కాలిక సీఈవో విక్రమ్ ఎస్ కస్బేకర్ పేర్కొన్నారు. వరుసగా 24వ ఏడాదిలోనూ మార్కెట్ లీడర్‌గా కంపెనీ కొనసాగినట్లు తెలియజేశారు. కీలకమైన 125 సీసీ విభాగంలో కన్సాలిడేషన్ జరుగుతున్నదని, భవిష్యత్‌లో ఈవీల విడుదల ద్వారా వృద్ధి కొనసాగనున్నట్లు వివరించారు.**

# కాంట్రాక్టు ఉద్యోగుల జీతాలు పెరిగాయ్...





భారత టెలికాం రంగంలో కాంట్రాక్టు ఉద్యోగుల సగటు నెలవారీ వేతనం పెరిగింది. 2022 ఆర్థిక సంవత్సరంలో రూ .24,609 లుగా ఉన్న కాంట్రాక్టు ఉద్యోగి సగటు జీతం 2025 ఆర్థిక సంవత్సరంలో రూ .25,225 కు చేరినట్లు టీమ్ లీజ్ సర్వీసెస్ తాజా డేటా సూచిస్తోంది. నివేదిక ప్రకారం.. భారత టెలికాం పరిశ్రమ 2025లో ఒప్పంద శ్రామిక శక్తి విస్తరణలో మందగమనాన్ని చవిచూసింది. అదే సమయంలో తమ కార్యాచరణ అవసరాల కోసం యువ ప్రతిభావంతులపై పెట్టుబడులనూ కొనసాగిస్తోంది.

**నివేదికలోని మరన్ని వివరాలు**

- కాంట్రాక్టు ఉద్యోగుల్లో 18 నుంచి 32 ఏళ్ల మధ్య వయస్కులే ఎక్కువగా ఉన్నారు.
- 202425 ఆర్థిక సంవత్సరంలో అసోసియేట్ స్థాయిలో కాంట్రాక్టు ఉద్యోగాల వృద్ధి 11.9 శాతానికి తగ్గింది.
- అట్రిషన్ స్థాయిలు కాలక్రమేణా సాపేక్షంగా స్థిరంగా ఉన్నాయి. ఇది 202122 ఆర్థిక సంవత్సరంలో 50.8 శాతం, 202425 ఆర్థిక సంవత్సరంలో 50.3 శాతంగా నమోదైంది.
- కాంట్రాక్ట్ అసోసియేట్లలో ఎక్కువ మంది తమ కెరీర్ ప్రారంభ దశలో ఉన్నవారే. 60 శాతం మందికి రెండు సంవత్సరాల కంటే తక్కువ అనుభవం ఉంది.

'ఈ డేటా టెలికాం రంగ శ్రామిక శక్తి వ్యూహంలో స్థిరమైన పునఃసమీక్షను ప్రతిబింబిస్తుంది. నియామకాలు మరింత ఆచితూచి చేస్తున్నప్పటికీ, డైనమిక్, కస్టమర్‌ఫేసింగ్, టెక్నికల్ ఉద్యోగాలకు తగిన యువ, విద్యావంతులైన అభ్యర్థులను తీసుకోవడంపై బలమైన దృష్టి కొనసాగుతోంది" అని టీమ్‌లీజ్ సర్వీసెస్ స్టాఫింగ్ సీఈవో కార్తీక్ నారాయణ్ అన్నారు.


# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు



దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం స్వల్ప లాభాలతో ముగిశాయి. నిన్నటి అస్థిర సెషన్ తరువాత, భారత్, యూఎస్‌ల నుంచి ఊహించిన దానికంటే మెరుగైన సీపీఐ ద్రవ్యోల్బణ డేటా మద్దతుతో భారత ఈక్విటీ బెంచ్‌మార్క్ సూచీలు గ్రీన్‌లో స్థిరపడ్డాయి. ఏప్రిల్ నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం 3.16 శాతానికి పడిపోయింది. బీఎస్ఈ బెంచ్‌మార్క్ సూచీ సెన్సెక్స్ 182.34 పాయింట్లు లేదా 0.22 శాతం పెరిగి 81,330.56 వద్ద ముగిసింది. అలాగే ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 కూడా 88.55 పాయింట్లు లేదా 0.36 శాతం లాభపడి 24,666.90 వద్ద ముగిసింది.

సెన్సెక్స్ లోని 30 షేర్లలో 22 షేర్లు లాభాల్లో ముగిశాయి. టాటా స్టీల్ 3.95 శాతం, టెక్ మహీంద్రా 2.26 శాతం, ఎటర్నల్ 2.20 శాతం, మారుతీ సుజుకీ 1.66 శాతం, ఇన్ఫోసిస్ 1.52 శాతం లాభపడ్డాయి. ఏషియన్ పెయింట్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్, టాటా మోటార్స్, పవర్ గ్రిడ్, ఎన్టీపీసీ 1.64 శాతం వరకు నష్టపోయాయి. కాగా విస్తృత మార్కెట్లు బెంచ్‌మార్క్ సూచీలను అధిగమించాయి. బీఎస్ఈ మిడ్ క్యాప్ 1.19 శాతం, బీఎస్ఈ స్మాల్ క్యాప్ 1.63 శాతం లాభపడ్డాయి. రంగాలవారీగా చూస్తే నిఫ్టీ మెటల్, రియల్టీ, ఆయిల్ అండ్ గ్యాస్, ఐటీ, ఎనర్జీ, మీడియా 2.46 శాతం వరకు లాభపడ్డాయి. నిఫ్టీ ఆటో, హెల్త్ కేర్, ఫార్మా, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఎఫ్ఎంసీజీ 1 శాతం వరకు పెరిగాయి. నిఫ్టీ బ్యాంక్ 0.25 శాతం, ఫైనాన్షియల్ సర్వీసెస్ 0.23 శాతం నష్టపోయాయి. భారత మార్కెట్లో అస్థిరతను కొలవడానికి ఉపయోగించే ఫియర్ గేజ్ ఇండియా వీఐఎక్స్ 5.61 శాతం క్షీణించి 17.18 పాయింట్లకు పడిపోయింది.

# కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు



**ఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఉత్తర ప్రదేశ్‌లో సెమీ కండక్టర్ యూనిట్ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉన్న సెమీ కండక్టర్ పరిశ్రమ ఇప్పుడు భారత్‌లోనూ రూపుదిద్దుకుంటోంది. ఇప్పటికే దేశంలో ఐదు సెమీకండక్టర్ యూనిట్లు నిర్మాణ దశలో ఉండగా ఆరో యూనిట్‌గా ఇది ఏర్పాటవుతోంది.


### రూ.3706 కోట్ల వ్యయంతో..

హెచ్‌సీఎల్, ఫాక్స్‌కాన్ సంయుక్త భాగస్వామ్యంతో యూపీలోని జెవార్ ఎయిర్‌పోర్టు సమీపంలో ఈ కొత్త సెమీ కండక్టర్ యూనిట్ ఏర్పాటు కానుంది. రూ.3706 కోట్ల వ్యయంతో దీన్ని ఏర్పాటు చేస్తున్నారు. 2027 నాటికి ఈ యూనిట్ నిర్మాణం పూర్తయి ఉత్పత్తిని మొదలుపెట్టనుంది. ఇక్కడ మొబైల్ ఫోన్లు, లాప్‌టాప్‌లు, ఆటోమొబైల్స్, పర్సనల్ కంప్యూటర్స్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాల్లో వినియోగించే చిప్‌లను ఇక్కడ ఉత్పత్తి చేయనున్నారు. ప్రతి నెలా 3.6 కోట్ల యూనిట్లను తయారు చేసే సామర్థ్యంతో ఈ భారీ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే గుజరాత్, అస్సాం రాష్ట్రాల్లో ఐదు సెమీకండక్టర్ యూనిట్లు నిర్మాణ దశలో ఉన్నాయి. ఇక కేంద్ర కేబినెట్ ప్రకటించిన నిర్ణయాల్లో బెంగళూరు, నోయిడా ప్రాంతాలలో డిస్‌ప్లే చిప్స్ హబ్‌ల ఏర్పాటు ఉంది. అలాగే తిరుపతి ఐఐటీ విస్తరణకు కూడా కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది.



# దేశం-విదేశం

NATIONAL-INTERNATIONAL



# 2027లో సుప్రీంకోర్టు చరిత్రలోనే రికార్డు సృష్టించనున్నది ఎవరో తెలుసా?



భారత 52వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బీఆర్ గవాయ్ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు, ఆరు నెలలు పాటు నవంబర్ 23 దాకా ఆయన సీజేఐగా సేవలందిస్తారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఆయనతో రాష్ట్రపతి ద్రౌపదీముర్ము ప్రమాణం చేయించారు. జస్టిస్ గవాయ్ ప్రస్తుత సిజెఐ సంజీవ్ ఖన్నా మాదిరిగానే ఆరు నెలల పాటు అత్యున్నత న్యాయాధికారిగా సేవలందిస్తారు. ఇంతకంటే తక్కువ రోజులు పదవిలో ఉన్న ప్రధాన న్యాయమూర్తుల గురించి తెలుసు కుందాం.

### జస్టిస్ బీవీ నాగరత్న ఘనత

భారత సుప్రీంకోర్టు స్థాపించి 75 ఏళ్లు పూర్తయ్యాయి. ప్రధాన న్యాయమూర్తి పదవి ఇంతవరకు ఏ మహిళకు దక్కలేదు. కానీ ప్రముఖ న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న 2027లో భారతదేశపు మొదటి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా రికార్డు సృష్టించనున్నారు. ఆమె పదవీకాలం కేవలం 36 రోజులు మాత్రమే. 2027, సెప్టెంబర్ 25 నుండి అక్టోబర్ 30 వరకు మాత్రమే ఆమె ఈ పదవిలో ఉన్నారు. అయితే ఇదే తక్కువ కాదు. అత్యల్ప కాలం సీజేఐగా పనిచేసిన వారు జస్టిస్ కమల్ నారాయణ్ సింగ్. ఆయన పదవీకాలం కేవలం 17 రోజులు మాత్రమే. సుప్రీంకోర్టులో ఒక మహిళా న్యాయమూర్తిగా అత్యధిక కాలం అంటే 6 సంవత్సరాల 2 నెలల పాటు పనిచేసిన తర్వాత బివి నాగరత్న 54వ సిజెఐగా ఆమె పదవీ కాలం కేవలం 36 రోజులు మాత్రమే ఉండనుంది. సెప్టెంబర్ 27, 2027న రికార్డులు మీద రికార్డు సృష్టించనున్నారు జస్టిస్ బీవీ నాగరత్న.

- 75 సంవత్సరాల చరిత్రలో భారతదేశపు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తి అవుతారు.
- సుప్రీంకోర్టులో మహిళా న్యాయమూర్తిగా అత్యధిక కాలం అంటే ఆరు సంవత్సరాల రెండు నెలలు పనిచేసిన రికార్డు
- అంతేకాదు ఆమె తండ్రి జస్టిస్ ఇఎస్ వెంకటరామయ్య 19వ సీజేఐగా పనిచేశారు. ఈ నేపథ్యంలో భారతదేశ చరిత్రలో భారతదేశ ప్రధాన న్యాయమూర్తులుగా పనిచేసిన తొలి తండ్రీ బిడ్డలుగా నిలవనున్నారు.
- 2008లో జస్టిస్ బీవీ నాగరత్నకర్ణాటక హైకోర్టుకు ఎంపికయ్యారు. 2021 ఆగస్టులో సుప్రీంకోర్టుకు పదోన్నతి పొందారు.

### మరిన్ని విశేషాలు

అత్యధిక కాలం పనిచేసింది జస్టిస్ యశ్వంత్ విష్ణు చంద్రచూడ్ భారత ప్రధాన న్యాయమూర్తిగా 7 సంవత్సరాల 139 రోజులు పనిశారు. అత్యంత తక్కువ రోజులు పనిచేసిన వారిలో కమల్‌నారాయణ్ సింగ్ తరువాత జస్టిస్ ఎస్ రాజేంద్ర బాబు నిలుస్తారు. రాజేంద్ర బాబు పదవీకాలు 29 రోజులు . సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం సీనియారిటీ నియమాన్ని అలాగే పాటిస్తే, జస్టిస్ బివి నాగరత్న మేడో అతి తక్కువ పదవీకాలం అంటే 36 రోజులు సేవలందించే అవకాశం ఉంది.ఇప్పటివరకు భారతదేశంలోని 51 మంది 11 మంది చీఫ్ జస్టిస్‌లలో అందరూ పురుషులే. 11 మంది మహిళలు మాత్రమే సుప్రీం కోర్టులో న్యాయమూర్తులుగా పనిచేశారు. సీనియారిటీకి అనుగుణంగా న్యాయమూర్తులను పదోన్నతి కల్పించాలనే అలిఖిత నియమాన్ని అనుసరిస్తుంది. ఈ నియమం ప్రకారం, సాధారణంగా, పరిశీలనలో ఉన్న న్యాయమూర్తులలో, సీనియర్ న్యాయమూర్తిని అత్యున్నత న్యాయస్థానానికి ఎంపిక చేస్తారు. అదే విధంగా, సీనియర్ న్యాయమూర్తి ప్రధాన న్యాయమూర్తి అవుతారు. ఇతర నియమిత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల పదవీకాలం కూడా కేవలం ఆరు నెలల నుండి ఒక సంవత్సరం వరకు ఉంటుంది. ఈనేపథ్యంలో మాజీ చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా డివై చంద్రచూడ్ ఎనిమిది మంది ప్రధాన న్యాయమూర్తులను హైకోర్టులకు నియమించారు. వారిలో ప్రధాన న్యాయమూర్తి రాజీవ్ శక్తిధర్ హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు నుండి కేవలం 24 రోజుల తర్వాత పదవీ విరమణ చేశారు.అయితే ఇటీవలి కాలంలో సుప్రీం కోర్టు మరియు హైకోర్టులలో ప్రధాన న్యాయమూర్తుల పదవీకాలంపై చర్చ మొదలైంది. భారత 40వ ప్రధాన న్యాయమూర్తి పళనిసామి గౌండర్ సదాశివం, CJIల స్వల్ప పదవీకాలంపై స్పందించారు. "నేను చేయాలనుకున్నవి చాలా ఉన్నాయి కానీ (నా) స్వల్ప పదవీకాలం కారణంగా చేయలేకపోయాను" అని పదవీ విరమణకు రెండు రోజుల ముందు వ్యాఖ్యానించడం గమనార్హం. ఈయన దాదాపు తొమ్మిది నెలలపాటు పదవిలో ఉన్నారు. ప్రధాన న్యాయమూర్తులకు స్థిరమైన పదవీ కాలం అవసరమని భావించారు.

సెప్టెంబర్ 2024లో జస్టిస్ హిమా కోహ్లీ పదవీ విరమణ చేసిన తర్వాత, సుప్రీంకోర్టులో మహిళా న్యాయ మూర్తుల సంఖ్య 34 మందిలో ఇద్దరు మాత్రమే మహిళలు. ప్రస్తుతం, జస్టిస్ బీవీ నాగరత్న , జస్టిస్ బేలాఎం త్రివేది మాత్రమే సుప్రీంకోర్టులో మహిళా న్యాయమూర్తులు. 1989లో సుప్రీంకోర్టుకు నియమితులైన మొదటి మహిళా న్యాయమూర్తిగా జస్టిస్ ఫాతిమా బీవీ చరిత్ర సృష్టించారు, కానీ ఆమె సుప్రీంకోర్టుకు ఎంపికైన మహిళా న్యాయమూర్తులలో రెండున్నర సంవత్సరాల అతి తక్కువ పదవీకాలం పనిచేశారు. ఇండియా జస్టిస్ రిపోర్ట్ 2025 ప్రకారం, హైకోర్టు న్యాయమూర్తులలో 14శాతం మంది మహిళలు ఉన్నారు. సీనియారిటీ నియమాన్ని అలాగే పాటిస్తే రాబోయే కొన్ని సంవత్సరాలలో ఉన్నత న్యాయస్థానంలో మహిళల ప్రాతినిధ్యం మరింత పెరుగుతుందా అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నే.

# ప్రధాని మోదీ నివాసంలో కీలక సమావేశం



న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్ లో భాగంగా న్యూఢిల్లీలోని ప్రధాని నరేంద్ర మోదీ నివాసంలో హైలెవిల్ సీసీఎస్ సమావేశం జరిగింది. పలువురు కీలక కేబినెట్ మంత్రులతో ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోంమంత్రి అమిత్ షాలు హాజరయ్యారు. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత ఆపరేషన్ సిందూర్ తో పాక్ లోని ఉగ్రస్థావరాలను భారత్ నేలమట్టం చేసింది. ఈ క్రమంలోనే వరుసగా సీసీఎస్ సమావేశాలు నిర్వహిస్తున్నారు ప్రధాని మోదీ. గత 20 రోజుల్లో సీసీఎస్ భేటీ కావడం ఇది ఐదోసారి. అయితే భారత్‌పాక్‌లు కాల్పుల విరమణకు అంగీకారం తెలిపిన తర్వాత సీసీఎస్‌తో ప్రధాని మోదీ భేటీ కావడం తొలిసారి. ఈ సందర్భంగా ప్రధాని మోదీని కేబినెట్ ప్రశంసించింది. ఆపరేషన్ సిందూర్ తో పాకిస్తాన్ కు గట్టిగా బుద్ధి చెప్పారని మోదీని అభినందించింది. సరైన సమయంలో మంచి నిర్ణయం తీసుకున్నారని కేబినెట్ కొనియాడింది. కాగా, పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్, పాకిస్తాన్ ల మధ్య ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్న సంగతి విదితమే. ఉగ్రవాదుల ఏరివేతే లక్ష్యంగా పాకిస్తాన్ పై దాడికి దిగింది భారత్. పాకిస్తాన్ కు గట్టిగా బుద్ధి చెప్పాలనే ఉద్దేశంతో ఆపరేషన్ సిందూర్ ను ఆరంభించి దాయాది దేశంలోని పలు ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసింది. అదే సమయంలో పాకిస్తాన్ లోని పలు ఎయిర్ బేస్‌లను సైతం భారత్ నేలమట్టం చేసింది. పాకిస్తాన్ పదే పదే కవ్వింపు చర్యలకు పాల్పడిన తరుణంలో భారత్ ఆపరేషన్ సిందూర్ తో తన సత్తా ఏమిటో చూపెట్టింది.

# త్వరలో కేసీఆర్ సీఎం

## ఇది బీజేపీ భవిష్యవాణి

- కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజీ డీల్
- గులాబీ పార్టీని విలీనం చేయడం ఖాయం
- జూన్ 2 లేదా డిసెంబర్ 9 తర్వాత విలీనం చేస్తారు
- బీజేపీ నేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్ర రాజకీయాలపై బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అతి త్వరలో తెలంగాణ రాజకీయాలు ఊహించని మలుపులు తిరుగే అవకాశాలు ఉన్నట్లు ఆయన వ్యాఖ్యలు ఉన్నాయి. అయితే మా పార్టీ వారు ముఖ్యమంత్రి అవుతారని అవుతారని ఎవరైనా చెప్పుకుంటారు. కానీ పక్క పార్టీ వాళ్లు సీఎం అవుతారని చెప్పడం కష్టం. తెలంగాణ బీజేపీ నేతలు మాత్రం అలాంటి ప్రకటనలు చేస్తూంటారు. కొన్ని రోజుల్లోనే బీఆర్ఎస్ కనుమరుగుకానుందని, కాంగ్రెస్ పార్టీలో విలీనమవడానికి బీఆర్ఎస్ రెడీ అయిందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ఒప్పందం కూడా జరిగిందని వ్యాఖ్యానించారు. జూన్ 2 తర్వాత గానీ, డిసెంబర్ 9 తర్వాత గానీ కాంగ్రెస్ పార్టీలో బీఆర్ఎస్ విలీనం కావడం ఖాయమన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి స్థానంలో కేసీఆర్ సీఎం అవుతారంటూ చెప్పుకొచ్చారు. బుధవారం బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

### వారికి పథకాలు దక్కడం లేదు..

గతంలో కవితకు సాయం చేసిన న్యాయవాదిని చట్టసభకు పంపించడానికి బీఆర్ఎస్ ఎలా సహాయం చేసిందో అందరికీ తెలుసన్నారు. సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక గ్రామ సభల ద్వారా ఎంపిక జరగడం లేదన్నారు. దీంతో గతంలో బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ కు చెందిన వారికే సంక్షేమ ఫలాలు జరుగుతున్నాయన్నారు. రాజకీయ నేపథ్యం లేని వారికి పథకాలు దక్కడం లేదన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందన్నారు. అనుకున్న లక్ష్యాన్ని అతి తక్కువ సమయంలో భారత్ సాధించిందన్నారు. ప్రపంచదేశాల్లో పాకిస్తాన్‌ను ఏకాకిని చేసిన ఘనత ప్రధాని మోదీకి దక్కిందన్నారు. ఉగ్రవాదులపై కమ్యూనిస్టుల తీరు మారలేదని ఫైర్ అయ్యారు. వారి కౌన్సిల్ సమావేశాల్లో ఎప్పుడూ ఉగ్రవాదులకు వ్యతిరేకంగా మాట్లాడలేదన్నారు. తాము ఎదగాలని కాకుండా.. బీజేపీని ఓడించాలని వారు ప్రయత్నిస్తారని ఎద్దేవా చేశారు. దేశవ్యాప్తంగా దారుణంగా ఓటమి పాలవుతున్నా వారి బుద్ధి మారడం లేదన్నారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ నేతలు ఏమైనా బీఆర్ఎస్ విలీనం అంటూ జరిగితే అది బీజేపీలోనేనని అంటున్నారు. అందుకే ఇప్పుడు వారు బీజేపీపై ఒక్క మాట కూడా మాట్లాడటం లేదని చెబుతున్నారు.

## ఒకప్పుడు బాక్సింగ్ చాంపియన్..

# ఇప్పుడు రామ్ చరణ్ బౌన్సర్!




దిగ్గజ బాక్సర్ మైక్ టైసన్‌తో తలపడ్డ యోధుడు అతడు.. ఐదుసార్లు బ్రిటిష్ హెవీవెయిట్ చాంపియన్‌షిప్ గెలిచిన వీరుడు.. అంతేకాదు నాలుగుసార్లు కామన్‌వెల్త్ చాంపియన్‌గా నిలిచిన ఘనత అతడిది.. కానీ ఇప్పుడు ఓ ఈవెంట్లో బౌన్సర్.. ఆ బాక్సింగ్ చాంపియన్ పేరు జూలియస్ ఫ్రాన్సిస్ (Julius Francis). కాగా టాలీవుడ్ హీరో, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ (Ram Charana) మైనపు విగ్రహాన్ని ఇటీవలే.. లండన్‌లోని మేడమ్ టుస్సాడ్స్ (Madame Tussauds) మ్యూజియంలో ఆవిష్కరించిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమానికి కుటుంబంతో సహా చెర్రీ హాజరయ్యాడు. ఈ సందర్భంగా రామ్ చరణ్ తన అభిమానులను కలిసేందుకు మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాడు. ఈ క్రమంలో బౌన్సర్ల బృందంలో బ్రిటిష్ హెవీవెయిట్ చాంపియన్ బాక్సర్ జూలియస్ ఫ్రాన్సిస్ కూడా కనిపించడం విశేషం. అంతేకాదు.. ఫ్రాన్సిస్ తన బాక్సింగ్ బెల్టును తీసుకుని రామ్ చరణ్ దగ్గరికి వచ్చి.. దానిని తన భుజం చుట్టూ వేయాల్సిందిగా కోరాడు. ఇందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

### ఎవరీ జూలియస్ ఫ్రాన్సిస్?

1993 2006 మధ్య జూలియస్ ఫ్రాన్సిస్ ప్రొఫెషనల్ బాక్సర్‌గా ఉన్నాడు. 2000 సంవత్సరంలో దిగ్గజ బాక్సర్ మైక్ టైసన్‌తో తలపడ్డ అతడు.. ఓటమి చవిచూశాడు. అరవై ఏళ్ల జూలియస్ ఓవరాల్‌గా తన కెరీర్‌లో 23 విజయాలు సాధించి.. ఇరవై నాలుగింటిలో ఓడిపోయాడు. ఇక 2007లో మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ బౌట్‌లోనూ జూలియస్ ఫ్రాన్సిస్ పాల్గొన్నాడు. 2012లో నటనా రంగంలోనూ అడుగుపెట్టాడు. ఆ తర్వాత 2022లో యూకేలో ఓ రెస్టారెంట్ బయట ఇంగ్లండ్ ఫుట్‌బాల్ జట్టు అభిమానులతో ఓ వ్యక్తికి గొడవ జరుగగా.. అక్కడే బౌన్సర్‌గా ఉన్న ఫ్రాన్సిస్ సదరు ఫ్యాన్స్‌ను నెట్టివేశాడు. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ కావడంతో చాలాకాలం తర్వాత ఫ్రాన్సిస్ మరోసారి తెరమీదకు వచ్చాడు. ఇదిలా ఉంటే.. బాక్సర్ మైక్ టైసన్‌కు టాలీవుడ్‌తో అనుబంధం ఏర్పడిన విషయం తెలిసిందే. విజయ్ దేవరకొండ హీరోగా నటించిన లైగర్ సినిమాలో అతడు కీలక పాత్రలో కనిపించాడు.



## అలాంటి దేశాల్లో మన డబ్బులు ఖర్చు చేయకండి: టాలీవుడ్ హీరో సిద్ధార్థ్

టాలీవుడ్ యంగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ్ ప్రస్తుతం స్వయంభూ మూవీలో నటిస్తున్నారు. ఈ మూవీలో సంయుక్త మీనన్ హీరోయిన్‌గా నటిస్తోంది. పాన్ ఇండియా రేంజ్‌లో తెరకెక్కుతున్న ఈ భారీ చిత్రానికి భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ మూవీ శరవేగంగా షూటింగ్ జరుగుతోంది. ఇక సినిమాల సంగతి పక్కనపెడితే నిఖిల్ తాజాగా చేసిన ట్వీట్ నెట్టింట వైరల్‌గా మారింది. ఇంతకీ అదేంటో చూసేద్దాం. ఇండియాపాకిస్తాన్ యుద్ధం నేపథ్యంలో నిఖిల్ సిద్ధార్థ్ ట్వీట్ చేశారు. పాక్‌కు మద్దతుగా టర్కీ నిలవడంపై నిఖిల్ ఫైరయ్యారు. ఇకపై ఎవరూ కూడా టర్కీని సందర్శించవద్దని భారతీయులను కోరారు. టర్కీలో భారతీయులు ప్రతి సంవత్సరం బిలియన్ల డాలర్లు ఖర్చు చేస్తారని.. భారత్‌కు వ్యతిరేకంగా వ్యవహరించే దేశాల కోసం డబ్బు ఖర్చు చేయాల్సిన అవసరం లేదన్నారు. విహారయాత్రల కోసం అలాంటి దేశాలకు మనం వెళ్లాల్సిన అవసరం లేదని తెలిపారు. పాక్‌తో తాము సత్సంబంధాలు కొనసాగిస్తామని టర్కీ ప్రెసిడెంట్ ఎర్గోడాన్ చేసిన కామెంట్స్‌పై ఓ నెటిజన్స్ పోస్ట్ చేశాడు. దీనిపై టాలీవుడ్ హీరో నిఖిల్ రియాక్ట్ అయ్యారు. ప్రస్తుతం ఈ ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## ప్రేమలు బ్యూటీ రెమ్యునరేషన్.. రేటు పెంచేసిందా?



హీరోయిన్లు ఎప్పుడు ఎలా ఫేమస్ అవుతారో చెప్పలేం. కొందరు ఏళ్లకు ఏళ్లు కష్టపడినా గుర్తింపు రాదు. మరికొందరు ఒక్క మూవీకే ఓవర్ నైట్ స్టార్ అయిపోతుంటారు. 'ప్రేమలు' బ్యూటీ మమిత ఈ కోవలోకే వస్తుంది. తెలుగు, తమిళంలో వరస సినిమాలు చేస్తున్న ఈమె ఇప్పుడు రెమ్యునరేషన్ గట్టిగానే పెంచేసినట్లు తెలుస్తోంది.

మలయాళంలో తొలుత పలు సినిమాల్లో సహాయ పాత్రలు చేసిన మమితకు 'ప్రేమలు' మూవీతో హీరోయిన్ గా బ్రేక్ దొరికింది. అటు సొంత భాషతో పాటు తెలుగులోనూ మంచి క్రేజ్ దక్కించుకుంది. ప్రస్తుతం ఈమె మైత్రీ మూవీ మేకర్స్ తీస్తున్న 'డ్యూడ్', దళపతి విజయ్ లేటెస్ట్ చిత్రాల్లో నటిస్తోంది. ఇదివరకు హీరోయిన్ గా ఒక్కో సినిమాకు రూ.50 లక్షల్లోపే రెమ్యునరేషన్ అందుకున్న మమిత.. ఇప్పుడు 'డ్యూడ్' కోసం రూ.70 లక్షలకు పైనే అందుకుంటోందట. దళపతి విజయ్ తో చేస్తున్న జన నాయగణ్ కోసమైతే ఏకంగా రూ.కోటి పారితోషికం అందుకుందట.

ఒకవేళ ఈ రెండు సినిమాలు గనక హిట్ అయితే తెలుగుతో పాటు తమిళంలోనూ క్రేజ్ రావడం గ్యారంటీ. అప్పుడు ఇంకాస్త రెమ్యునరేషన్ పెంచినా సరే ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. ప్రస్తుతం ఈ రెండు కాకుండా మరో తమిళ మూవీ కూడా మమిత చేతిలో ఉంది.

## క్రీడా వార్తలు | SPORTS NEWS

# ఐపీఎల్ రీ స్టార్ట్.. ముంబై ఇండియన్స్‌కు గుడ్ న్యూస్!



ఐపీఎల్2025 సీజన్ పునఃప్రారంభానికి సమయం ఆసన్నమవుతోంది. భారత్‌పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తల కారణంగా అర్ధాంతరంగా నిలిచిపోయిన ఈ ఏడాది క్యాష్‌రిచ్ లీగ్ సీజన్ తిరిగి మే 17 నుంచి ప్రారంభం కానుంది. ఇప్పటికే రీ షెడ్యూల్‌ను కూడా బీసీసీఐ ప్రకటించింది. అయితే ఐపీఎల్ తాతాత్కాలికంగా వాయిదా పడడంతో చాలా మంది విదేశీ ఆటగాళ్లు తమ స్వదేశానికి వెళ్లిపోయారు. దీంతో వారు మిగిలిన మ్యాచ్‌లు కోసం తిరిగి భారత్‌కు వస్తారా లేదా అన్న సందిగ్ధం ఇంకా కొనసాగుతోంది. ఈ క్రమంలో ముంబై ఇండియన్స్‌కు ఓ గుడ్ న్యూస్ అందింది. న్యూజిలాండ్ స్టార్ పేసర్ ట్రెంట్ బౌల్ట్ తిరిగి ముంబై ఇండియన్స్ జట్టులో చేరనున్నాడు. వారం పాటు ఈ ధనాధాన్ టీ20 లీగ్ వాయిదా పడడంతో బౌల్ట్ తన స్వదేశానికి వెళ్లిపోయాడు. ఇప్పుడు ఐపీఎల్ మళ్లీ రీ స్టార్ట్ కానుండడంతో బౌల్ట్ ఒకట్రెండు రోజుల్లోనే భారత గడ్డపై అడుగుపెట్టనున్నట్లు ఈఎస్పీఎన్ క్రిక్ ఇన్ఫో తమ కథనంలో పేర్కొంది. ఈ ఏడాది సీజన్‌లో ముంబై ఇండియన్స్‌కు ఇంకా రెండు లీగ్ మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో ఉన్న ముంబై.. తమ ప్లే ఆఫ్స్ స్థానాన్ని పదిలి చేసుకోవాలంటే మిగిలిన రెండు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించాలి. ఈ సమయంలో బౌల్ట్ తిరిగి జట్టులో చేరడం ముంబైకి కలిసొచ్చే అంశంగా చెప్పుకోవాలి. ఈ ఏడాది సీజన్‌లో బౌల్ట్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. ఇప్పటివరకు 12 మ్యాచ్‌లు ఆడిన ఈ కివీ స్టార్ పేసర్.. 18 వికెట్లు పడగొట్టాడు. ముంబై ఇండియన్స్ తమ తదుపరి రెండు మ్యాచ్‌ల్లో మే 21న ఢిల్లీ క్యాపిటల్స్, మే 26న పంజాబ్ కింగ్స్‌తో తలపడనుంది.



## ప్రస్తుతానికి ఎలాంటి కమిట్‌మెంట్స్ లేవు.. ఫోకస్ అంతా ఐపీఎల్‌పైనే..!

రోజుల వ్యవధిలో టెస్ట్‌లకు రిటైర్మెంట్ ప్రకటించిన భారత క్రికెట్ దిగ్గజాలు ప్రస్తుతం తమ ఫోకస్ అంతా ఐపీఎల్ 2025పైనే పెట్టారు. ఐపీఎల్ ప్రారంభానికి ముందు, మధ్యలో కూడా వారిపై ఇంగ్లండ్ టెస్ట్ సిరీస్‌కు సంబంధించిన ఒత్తిడి ఉండేది. టెస్ట్‌లకు రిటైర్మెంట్ ప్రకటించడంతో వారిద్దరు ఫ్రీబర్డ్స్ అయ్యారు. వారిపై ఐపీఎల్ మినహా ఎలాంటి బాధ్యతా లేదు. ఈ ఇద్దరు దిగ్గజాలు అంతర్జాతీయ టీ20లకు గతేడాదే రిటైర్మెంట్ ప్రకటించారు. వారు ఇకపై భారత్ తరఫున వన్డేలకు మాత్రమే అందుబాటులో ఉంటారు. భారత్ ఆడబోయే వన్డేలు సమీప భవిష్యత్తులో లేవు. దీంతో వారి దృష్టి మొత్తం ఐపీఎల్ 2025పైనే కేంద్రీకృతమై ఉంది. మే 17 నుంచి ఐపీఎల్ పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో రోహిత్, కోహ్లి ముందున్న తక్షణ కర్తవ్యం వారి జట్లను ప్లే ఆఫ్స్‌కు చేర్చడం. ఇందు కోసం వారు అందరి కంటే ముందుగానే ప్రాక్టీస్ మొదలుపెట్టారు. ఐపీఎల్ రీవైజ్డ్ షెడ్యూల్‌కు విదేశీ ఆటగాళ్లు అందుబాటులో ఉంటారా లేదా అన్న సందిగ్ధత కొనసాగుతుండగా.. ఈ భారత సూపర్ స్టార్లు మాత్రం దాని తాలూకా ఆలోచనలు లేకుండా ప్రాక్టీస్‌లో నిమగ్నమై ఉన్నారు. ఐపీఎల్ తదుపరి లెగ్ కోసం రోహిత్ మూడు రోజుల కిందటి ప్రాక్టీస్ మొదలుపెట్టగా.. విరాట్ ఇవాళే బరిలోకి దిగాడని తెలుస్తుంది. ఐపీఎల్ పాక్షికంగా వాయిదా పడే సమయానికి రోహిత్, విరాట్ ప్రాతినిధ్యం వహిస్తున్న ముంబై ఇండియన్స్, ఆర్సీబీ పాయింట్ల పట్టికలో నాలుగు, రెండు స్థానాల్లో ఉన్నాయి. ఈ రెండు జట్లు ప్లే ఆఫ్స్ బెర్తుకు అతి చేరువలో ఉన్నాయి. ఇప్పటివరకు 12 మ్యాచ్‌లు ఆడిన ముంబై 7 విజయాలతో 14 పాయింట్లు సాధించగా.. ఆర్సీబీ 11 మ్యాచ్‌ల్లో ఎనిమిది గెలిచి 16 పాయింట్లు ఖాతాలో కలిగి ఉంది.


## సీఎస్‌కే అభిమానులకు శుభవార్త



మే 17 నుంచి ఐపీఎల్ 2025 పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో సీఎస్‌కే అభిమానులకు శుభవార్త. జేమీ ఓవర్టన్ (ఇంగ్లండ్) మినహా అందరు విదేశీ ఆటగాళ్లు తమ తదుపరి మ్యాచ్‌లకు అందుబాటులో ఉంటారని ఆ ఫ్రాంచైజీ సీఈవో కాశీ విశ్వనాథ్ స్పష్టం చేశారు. ఓవర్టన్ తన జాతీయ జట్టుకు (విండీస్‌తో వన్డే సిరీస్) ప్రాతినిధ్యం వహించాల్సి ఉండటంతో అతను భారత్‌కు తిరిగి రాలేదని విశ్వనాథ్ తెలిపారు. సీఎస్‌కేలో ఉన్న మిగతా విదేశీ ఆటగాళ్లు డెవాల్డ్ బ్రెవిస్ (సౌతాఫ్రికా), రచిన్ రవీంద్ర (న్యూజిలాండ్), సామ్ కర్రన్ (ఇంగ్లండ్), డెవాన్ కాన్వే (న్యూజిలాండ్), మతీష పతిరణ (శ్రీలంక), నాథన్ ఇల్లిస్ (ఆస్ట్రేలియా), నూర్ అహ్మద్ (ఆఫ్ఘనిస్తాన్) త్వరలో జట్టులో చేరతారని పీటీఐకి చెప్పారు. కాగా, ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో సీఎస్‌కే ప్లే ఆఫ్స్ రేసు నుంచి ఇదివరకే నిష్క్రమించిన విషయం తెలిసిందే. ఆ జట్టు ఇప్పటివరకు ఆడిన 12 మ్యాచ్‌ల్లో కేవలం మూడింట మాత్రమే విజయాలు సాధించిన ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించిన తొలి జట్టుగా నిలిచింది. ఈ సీజన్‌లో సీఎస్‌కే మరో రెండు మ్యాచ్‌లు మాత్రమే ఆడాల్సి ఉంది. మే 20న రాజస్థాన్ రాయల్స్‌తో (ఢిల్లీలో).. మే 25న గుజరాత్‌తో (అహ్మదాబాద్‌లో) తలపడాల్సి ఉంది. ఈ రెండు మ్యాచ్‌లతో సీఎస్‌కేకు కానీ వారి ప్రత్యర్థులకు కానీ ఎలాంటి ఉపయోగం లేదు. ఈ రెండు మ్యాచ్‌లు నామమాత్రంగానే సాగనున్నాయి. గుజరాత్ ప్లే ఆఫ్స్ బెర్త్‌కు అతి సమీపంలో ఉండగా.. రాజస్థాన్ రాయల్స్ సీఎస్‌కే తర్వాత ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించింది. ఇదిలా ఉంటే, భారత్, పాక్ మధ్య యుద్ధం కారణంగా ఐపీఎల్ 2025 వారం రోజులు వాయిదా పడిన విషయం తెలిసిందే. ఈ మధ్యలో విదేశీ ఆటగాళ్లంతా స్వదేశాలకు వెళ్లిపోయారు. ఐపీఎల్ తిరిగి పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో చాలా మంది తిరిగి వచ్చేందుకు సుముఖంగా ఉన్నారు. జాతీయ జట్ల అవసరాల దృష్ట్యా ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా, ఇంగ్లండ్, వెస్టిండీస్‌కు చెందిన ఆటగాళ్లు లీగ్ తదుపరి లెగ్‌కు అందుబాటులో ఉండరని తెలుస్తుంది. ఐపీఎల్ రీ షెడ్యూల్ అయిన తర్వాత వెస్టిండీస్, ఇంగ్లండ్ మధ్య వన్డే సిరీస్‌తో క్లాష్ అయ్యింది. ఐపీఎల్ ప్లే ఆఫ్స్ జరిగే తేదీల్లోనే ఈ సిరీస్ జరుగనుంది. ఐపీఎల్ ముగిసిన తర్వాత వారం వ్యవధిలోనే ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా మధ్య అత్యంత కీలకమైన డబ్ల్యూటీసీ ఫైనల్ జరుగనుంది. ప్రతిష్ఠాత్మకమైన మ్యాచ్‌కు కేవలం వారం రోజుల సమయం మాత్రమే ఉన్న నేపథ్యంలో ఆ రెండు జట్ల క్రికెట్ బోర్డులు ఐపీఎల్ తదుపరి లెగ్ నుంచి వైదొలగాలని భావిస్తున్నాయి. ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు ఆటగాళ్ల ఇష్టానికే ఈ విషయాన్ని వదిలిపెట్టగా.. సౌతాఫ్రికా క్రికెట్ బోర్డు మాత్రం తమ ఆటగాళ్లను తిరిగి వచ్చేయాలని ఒత్తిడి చేస్తోంది.

## ఐపీఎల్‌కు తిరిగి రానని స్పష్టం చేసిన ఆసీస్ ప్లేయర్..

# ప్రత్యామ్నాయ ఆటగాడి ప్రకటన



భారత్, పాక్ మధ్య యుద్ధం కారణంగా ఐపీఎల్ 2025 వారం రోజులు వాయిదా పడిన విషయం తెలిసిందే. ఈ మధ్యలో విదేశీ ఆటగాళ్లంతా స్వదేశాలకు వెళ్లిపోయారు. మే 17 నుంచి ఐపీఎల్ తిరిగి పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో చాలా మంది ఆటగాళ్లు తిరిగి భారత్‌కు వచ్చేందుకు సుముఖంగా ఉన్నారు. జాతీయ జట్ల అవసరాల దృష్ట్యా ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా, ఇంగ్లండ్, వెస్టిండీస్‌కు చెందిన ఆటగాళ్లు లీగ్ తదుపరి లెగ్‌కు అందుబాటులో ఉండరని తెలుస్తుంది. ఇదిలా ఉంటే, ఢిల్లీ క్యాపిటల్స్ ఓపెనర్ జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్ వ్యక్తిగత కారణాలను సాకుగా చూపుతూ ఐపీఎల్ తదుపరి మ్యాచ్‌ల నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించాడు. దీంతో డీసీ యాజమాన్యం అతనికి ప్రత్యామ్నాయంగా బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను ఎంపిక చేసుకుంది. ముస్తాఫిజుర్‌ను డీసీ రూ. 6 కోట్లకు సొంతం చేసుకుంది. ముస్తాఫిజుర్ ఈ సీజన్‌లో డీసీ ఆడబోయే తదుపరి మ్యాచ్‌లకు అందుబాటులో ఉంటాడు. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో ఐదో స్థానంలో ఉన్న డీసీ.. ప్లే ఆఫ్స్ అవకాశాలను ఇంకా సజీవంగా ఉంచుకుంది. ఆ జట్టు ఇప్పటివరకు ఆడిన 11 మ్యాచ్‌ల్లో 6 విజయాలు, 4 పరాజయాలు, ఫలితం తేలని ఓ మ్యాచ్‌లో లభించిన పాయింట్‌తో కలుపుకుని 13 పాయింట్లు (0.362) సాధించింది. ఈ సీజన్‌లో డీసీ మరో మూడు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. మే 18న గుజరాత్‌తో (ఢిల్లీ), మే 21న ముంబై ఇండియన్స్‌తో (ముంబై), మే 24న పంజాబ్‌తో (జైపూర్) తలపడాల్సి ఉంది. ఈ మూడు మ్యాచ్‌ల్లో రెండు ఖచ్చితంగా గెలిస్తేనే డీసీ ప్లే ఆఫ్స్ రేసులో ఉంటుంది. భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతల కారణంగా మే 8న ఢిల్లీ, పంజాబ్ మధ్య జరగాల్సిన మ్యాచ్ రద్దైన విషయం తెలిసిందే. అంతకుముందు హైదరాబాద్‌లో ఢిల్లీ, సన్‌రైజర్స్ మధ్య జరగాల్సిన మ్యాచ్ కూడా వర్షం కారణంగా రద్దైంది. ఈ రెండు మ్యాచ్‌ల్లో ఫలితాలు వచ్చినా ఢిల్లీకి వ్యతిరేకంగా ఉండేవి. ఈ రెంటిలో సన్‌రైజర్స్ మ్యాచ్‌కు గానూ ఢిల్లీకి ఓ పాయింట్ లభించగా.. పంజాబ్‌తో మ్యాచ్‌ను తిరిగి మొదటి నుండి ప్రారంభించనున్నారు (మే 24). పంజాబ్‌తో మ్యాచ్ రద్దయ్యే సమయానికి ఢిల్లీ దీన స్థితిలో ఉండింది. ఆ మ్యాచ్‌లో పంజాబ్ ఓపెనర్లు ప్రియాంశ్ ఆర్య, ప్రభ్‌సిమ్రన్ చెలరేగిపోయారు. 10 ఓవర్లలో ఆ జట్టు ఏకంగా 122 పరుగులు చేసింది.

**పీడ వదిలిందనుకుంటున్న ఢిల్లీ అభిమానులు**

ఢిల్లీ ఓపెనర్ మెక్‌గుర్క్ ఐపీఎల్ తదుపరి లెగ్‌కు అందుబాటులో ఉండనని ప్రకటించిన నేపథ్యంలో ఆ జట్టు అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే ఈ సీజన్‌లో 9 కోట్లు పెట్టి కొనుక్కున్న మెక్‌గుర్క్ దారుణంగా విఫలమయ్యాడు. 6 మ్యాచ్‌ల్లో 105.77 స్ట్రయిక్‌రేట్‌తో కేవలం 55 పరుగులు మాత్రమే చేశాడు. ఇందులో రెండు డకౌట్లు ఉన్నాయి. మెక్‌గుర్క్ స్థానంలో వచ్చిన ముస్తాఫిజుర్ బౌలింగ్ విభాగంలో ఉపయోగపడగలడని డీసీ అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. తమ స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ డబ్ల్యూటీసీ ఫైనల్ కారణంగా తదుపరి మ్యాచ్‌లకు అందుబాటులో ఉండే అవకాశాలు లేవు. ప్లే ఆఫ్స్ బెర్త్ సాధించాలంటే ఫామ్‌లోనే లేని మెక్‌గుర్క్ కంటే ముస్తాఫిజుర్ నయమవుతాడని డీసీ అభిమానులు అనుకుంటున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com